


నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 316 • పేజీలు : 8 • గురువారం 8 ఆగస్టు 2024 • వెల : రూ. 5.00 ఆ

Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati


## బంగ్లాలో ఆగని హింసాకాండ

- వేటాడి వెంటాడి చంపుతున్న హసీనా వ్యతిరేకులు
- ఊచకోతకు గురైన 29 మంది మృతదేహాల గుర్తింపు
- 20 మంది అవామీ లీగ్ నేతలుగా గుర్తింపు

7లో



## వినేశ్ ఫొగట్‌పై అనర్హత

- నువ్వెప్పుడూ ఛాంపియన్‌వే
- ఓదారుస్తూ.. ప్రధాని మోదీ ప్రకటన
- పిటి ఉషతో కారణాలపై ఆరా



**న్యూఢిల్లీ,ఆగస్టు 7 :** పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫొగాట్ పతకం సాధిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్న భారత అభిమానులకు షాక్ తగిలింది. 50 కేజీల విభాగంలో మిగతా 7లో

## ట్రంప్ హత్యకు భారీ కుట్ర



**వాషింగ్టన్,ఆగస్టు 7 :** ఇరాన్‌తో లింకులు ఉన్న పాకిస్థానీ జాతీయుడిని .. అమెరికా అరెస్టు చేసింది. అమెరికా రాజకీ యవేత్తలను హత్య చేసేందుకు ఆ పాక్ వ్యక్తి ప్లాన్ వేసినట్లు న్యూయార్క్ ఫెడరల్ కోర్టు పేర్కొన్నది. రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు అతను ప్లాన్ వేసినట్లు అనుమాని స్తున్నారు. పాక్‌కు చెందిన అసిఫ్ మిగతా 7లో





## నేతన్నల జీవితాల్లో వెలుగులు
# నింపుతాం

- ◆ చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దుకు ప్రయత్నాలు
- ◆ నెలలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దాం
- ◆ గత ప్రభుత్వం చేనేతలకు ఇచ్చే ప్రోత్సాహకాలన్నీ రద్దు చేసింది..
- ◆ ఐదేళ్ల పాలనలో ఏ శాఖలో చూసినా విధ్వంసమే కనిపిస్తోంది
- ◆ గత ప్రభుత్వం..చేనేతల సంక్షేమంపై దృష్టి పెట్టలేదు.
- ◆ చేనేత కార్మికుల గృహాలకు సౌరవిద్యుత్ సదుపాయం కల్పిస్తాం..
- ◆ తన సతీమణి భువనేశ్వరికి రెండు చీరలు కొనుగోలు చేసిన సీఎం చంద్రబాబు
- ◆ చేనేతకు అన్ని విధాలుగా అండగా ఉంటాం
- ◆ విజయవాడలో జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొన్న సీఎం



**విజయవాడ,ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** చేనేత కార్మికులకు కూ టమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. చేనేతకారులకు ఇచ్చిన అన్ని పథకా లనూ వైకాపా సర్కారు రద్దు చేసిందని మండిపడ్డారు. కార్మికుల ఆదాయం పెరిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విజయ వాడలో జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. స్టాళ్లలో ఉత్పత్తులు పరిశీలించి చేనేత కార్మికు లతో మాట్లాడారు. ఈ సందర్భంగా తన సతీమణి భువనేశ్వరికి రెండు చీరలు కొనుగోలు చేశారు. చట్టసభల్లో వెనుకబడిన వర్గాలకు 33శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేస్తామని ప్రకటించారు. ఇది పార్లమెంటులో చట్ట రూపం దా ల్చేలా పోరాటం చేస్తామన్నారు. వెనకబడిన వర్గాల్లో అనేక కులాలు ఉన్నాయని, వారి అభ్యున్నతికి కృషి మిగతా 7లో

## త్వరలో రెవెన్యూ
# సదస్సులు

- ఏపిలో మూడు నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేత
- క్యూఆర్ కోడ్‌తో కూడిన పాస్‌పుస్తకాలు పంపిణీ
- భూముల రీ- సర్వే ప్రక్రియను పక్కన పెట్టాలని నిర్ణయం
- జగన్ బొమ్మ, పేరు ఉన్న సర్వేరాళ్ల తొలగింపు
- అక్టోబర్ నుంచి కొత్త మద్యం విధానం..
- మత్స్యకారులకు విఘాతం కలిగించే 217 జీవో తొలగింపు
- ఏపి కేబినెట్ కీలక నిర్ణయాలు..వెల్లడించిన మంత్రి పార్థసారథి



**అమరావతి,ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** రెవెన్యూశాఖలో మూడు నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తామని, క్యూఆర్ కోడ్‌తో కూడిన పాస్‌పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి పార్థసారథి వెల్లడించారు. రాష్ట్రంలో అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం విధానం అమలు మిగతా 7లో



8లో

## కానరాని మార్పు

మాన్యులకు తప్ప అన్యులకు దొరకని శ్రీవారి నైవేద్య ప్రసాదాలు

## చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా
# ఉంటా..!

- ◆ యువత కూడా చేనేత వస్త్రాలు ధరిస్తే మంచిది
- ◆ చేనేతకు జీవం పోయాల్సిన బాధ్యత అందరిదీ..
- ◆ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేవరకు అండగా ఉంటాం
- ◆ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటన



**విజయవాడ, ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** అతిపెద్ద అసంఘటిత రంగాల్లో ఒకటైన చేనేత పరిశ్రమను ఆదుకోవ డా నికి ఏపీ కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. బుధవారం మిగతా 7లో

## ప్రధాని మోదీకి
# అరుదైన కానుక

- ◆ చేనేత చిత్తరువుతో చేసిన వస్త్రం బహుకరణ
- ◆ ప్రత్యేకతను చాటుకున్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు
- ◆ ఆరు అడుగుల పొడవు కలిగిన చేనేత వస్త్రంపై మోదీ చిత్రం
- ◆ ఈ కానుక అందుకోవడం ఓ తీయని జ్ఞాపకంగా భావిస్తున్నాను:మోదీ
- ◆ పీవీజీ రాజు ఒక సామాజిక చైతన్యవేత్త అని కొనియాడిన ప్రధాని



**న్యూఢిల్లీ,ఆగస్టు 7 :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అపురూప కానుకను అందజేశారు. ప్రధానిగా హ్యాట్రిక్ విజయం సాధించిన మోదీ లఘు చిత్రాన్ని ఓ చేనేత కుటుంబానికి చెందిన మిగతా 7లో

## జగన్ పిటిషన్‌పై
# విచారణ..

- ◆ జగన్ బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని రీప్లేస్ చేస్తాం
- ◆ కండిషన్లో ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఇస్తాం
- ◆ జగన్ భద్రతా సిబ్బంది సమాచారం ఇస్తే జామర్ ఇస్తాం
- ◆ ఎపి హైకోర్టుకు తెలిపిన ఏపీ ప్రభుత్వం..



**అమరావతి,ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** తనకు భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ మాజీ సీఎం జగన్ వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా జగన్‌కు ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనం రీప్లేస్ చేస్తామని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ప్రస్తుతం కండిషన్లో మిగతా 7లో

## త్వరలో 'అన్న' క్యాంటీన్లు



- ◆ అన్న క్యాంటీన్ల ప్రారంభంపై ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు
- ◆ తొలి విడతలో 100 చోట్ల అన్న క్యాంటీన్లు ప్రారంభం
- ◆ క్యాంటీన్లకు హరేకృష్ణ ఫౌండేషన్ ఆహారం సరఫరా

**అమరావతి,ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** ఏపీలో అన్న క్యాంటీన్ల ప్రారంభంపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 15 మిగతా 7లో

## విచారణను వేగవంతం
# చేయండి



- హోంమంత్రి అనితను కలిసిన వివేకా కుమార్తె సునీత
- పోలీసులు హంతకులకు అండగా నిలిచారని ఆరోపణ
- ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుంది: అనిత

**అమరావతి,ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** వైఎస్ వివేకా కుమార్తె సునీత ఏపీ హోంమంత్రి అనిత ను కలిశారు. తన తండ్రి హత్య కేసులో జరిగిన అన్యాయాన్ని ఆమె మంత్రికి వివరించారు. వివేకా హత్య తదనంతర పరిణామాలను హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ మిగతా 7లో



## సీబీఐపై సుప్రీం
# అసహనం

- ◆ జగన్ అక్రమాస్తుల కేసులపై విచారణ..
- ◆ నవంబర్ 11కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు
- ◆ సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ట్రయల్ చేపట్టాలి

**అమరావతి,ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** జగన్ అక్రమాస్తుల కేసులపై ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు దాఖలు చేసిన పిటిషన్‌పై మిగతా 7లో

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# పోల'వరం'!

గోదావరి,కృష్ణా నదులను అనుసంధానిస్తూ పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఈ ప్రాజెక్ట్ బహుళార్ధ సాధక నీటి పారుదల పథకం.ఇది ఆంధ్రప్రదేశ్ లోని కోట్లాది ప్రజల జీవనాడి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది.రాష్ట్ర పునర్విభజనలో భాగంగా చట్టం చేసింది.ఆ మధ్య డబ్బులు లేవంటూ యూ టర్న్ తీసుకుంది.అది ఏ మాత్రం న్యాయం కాదు.ఆంధ్రప్రదేశ్ విడిపోయినప్పుడు తెలంగాణ ప్రాంతానికి హైదరాబాద్ వంటి అన్ని వసతులు,ఆదాయ వనరులు కలిగివున్న రాజధాని దక్కింది. ఆంధ్రప్రదేశ్ కు రాజధాని లేదు. ఆదాయం పెద్దగా లేదు.ఇవ్వన్నీ గుర్తెరిగి పార్లమెంట్ లో అప్పుడు చట్టం చేశారు.ప్రత్యేక హెూదా ఇస్తామని తిరుమలస్వామి పాదాల చెంత సాక్షాత్తు ప్రధాని నరేంద్రమోదీ మాట ఇచ్చి తప్పారన్నది చేదునిజం.తదనంతర పరిణామాల్లో, ప్రత్యేక ప్యాకేజి పేరుతో ప్రత్యేక హెూదా అంశాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకుంది. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజికి తలవగ్గడం వల్లనే కేంద్రం మాట మార్చిందనే విమర్శలు వైసిపి పెద్దఎత్తున చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పోలవరం ప్రాజెక్టు వ్యయాన్ని 20వేల కోట్ల రూపాయలకే కుదిస్తూ, ఆర్థిక సాయం చేయలేమని చేతులెత్తేసింది.ఇది చాలా అన్యాయమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. కరోనా వ్యాక్సిన్లు,తదితర అంశాల పేరు చెప్పి, తమ దగ్గర డబ్బులు లేవని కేంద్ర ప్రభుత్వం అప్పట్లో చెప్పింది.ఇక రాష్ట్రాల పరిస్థితి ఏమని చెప్పాలి? ఆంధ్రప్రదేశ్ కొత్తగా ఏర్పడిన రాష్ట్రం, చిన్న రాష్ట్రం,ఆదాయ వనరులు అంతంత మాత్రమే ఉన్న రాష్ట్రం. దానికి తోడు, కరోనా, వరదలతో, వివిధ పథకాలతో,అప్పులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.ఇప్పుడు ప్రభుత్వం కూడా మారింది. జగన్ పాలనపోయి, మళ్ళీ చంద్రబాబు ఏలుబడి లోకి ఆంధ్రప్రదేశ్ వచ్చింది. కేంద్రంలోనూ – రాష్ట్రంలోనూ ప్రస్తుతం మళ్ళీ ఎన్డీఏ ప్రభుత్వాలే నడుస్తున్నాయి.బిజెపి ప్రభుత్వం నిలబడాలంటే టీడీపీ అండ అత్యంత అవసరమైన స్థితి ఇప్పుడు నడుస్తోంది. కేంద్ర పెద్దలను ఒప్పించి ప్రత్యేక హెూదాతో పాటు పోలవరం ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి కావాల్సిన సహాయసహకారాలు తీసుకోగలిగిన స్థితిలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వున్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఇదే మంచి తరుణం. చంద్రబాబు అధికారం చేపట్టిన వెనువెంటనే పోలవరాన్ని దర్శించారు.నిన్నటి వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల పోలవరం ప్రాజెక్టు ఎన్నోఏళ్ళు వెనక్కు వెళ్లిపోయిందని బాబు విమర్శలు సంధిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ప్రాజెక్టు పూర్తవ్వడానికి ఇంకా నాలుగేళ్ల కాలం పడుతుందని కొత్త ముఖ్యమంత్రి అంటున్నారు. పోలవరం నా జీవనాడి అంటున్నారు. పార్టీల రాజకీయాలు, నేతల అవినీతి ఆరోపణలు అలా ఉంచగా,సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి? రాష్ట్రంలో డబ్బులు లేనేలేవు.ఈ ప్రాజెక్టును భరించే శక్తి అస్సలు లేదు.పోలవరం ప్రాజెక్టులో ఖర్చు స్థూలంగా రెండు రకాలు.ప్రాజెక్టు నిర్మాణ వ్యయం, భూసేకరణ,పునరావాస ప్యాకేజిలు మొదలైనవి.ఈ రెండూ కలిపి మొత్తంప్రాజెక్టు ఖర్చుగా అంచనా వెయ్యాలి.ఎప్పుడో 1930-40లోనే సర్ ఆర్థర్ కాటన్ నదులను అనుసంధానం చెయ్యమని సూచించారు.1941లో అప్పటి ప్రభుత్వ ప్రధాన ఇంజనీర్ దివాన్ బహుద్దర్ ఎల్.వెంకటకృష్ణయ్య అయ్యర్ గోదావరిపై పోలవరం వద్ద జలాశయాన్ని నిర్మించాలని ప్రతిపాదించాడు.1946-47లో ప్రఖ్యాత ఇంజనీర్ కె ఎల్ రావు రామ పాద సాగరం పేరుతో ప్రాజెక్టు నివేదిక ఇచ్చారు.తర్వాత చాలా ఏళ్ళ తర్వాత, అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారు. 2004లో, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ఈ ప్రాజెక్టు పురోగతి ప్రారంభమైంది. 2015లో జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం గుర్తించింది.డబ్బులు సంపూర్ణంగా అందుబాటులో వుంటే? ఒక సంవత్సర కాలంలోనే ప్రాజెక్టు సంపూర్ణమవుతుందని ఇంజనీరింగ్ నిపుణులు అప్పుడు అంచనా వేశారు.ప్రాజెక్టు అంచనాలు వివిధ దశల్లో మార్పులకు గురైన సంగతి తెలిసిందే.ప్రారంభంలో 16,716 కోట్లగా ఉంది.2017-2018 సమయానికి ప్రాజెక్టు వ్యయం 55వేల కోట్లకు పైగా చేరింది. ఇది సవరించిన అంచనా. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,కేంద్ర జలసంఘం,టారిఫ్ నిర్ణయించే ఇంజనీరింగ్ కమిటీ,పోలవరం ప్రాజెక్టు అథారిటీ అందరూ ఈ వ్యయాన్ని అంగీకరించారు. తదనుగుణంగా అనుమతులు కూడా వచ్చాయి.ప్రాజెక్టు ప్రారంభంలో అంచనా ఒక రకంగా ఉన్నా,నిర్మాణ క్రమంలో ఖర్చులు మారుతుంటాయి. ఇది చాలా సాధారణమైన అంశం.దీన్ని కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది.కాబట్టి,సంపూర్ణంగా కేంద్రం బాధ్యత తీసుకోవాల్సిందే. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు వున్న సమయంలో అంచనాలు భారీగా పెంచారని, అనునాయులకే ప్రాజెక్టులు కట్టబెట్టారని, కోట్లాది రూపాయలు చేతులు మారాయని,పెద్ద స్థాయిలో అవినీతి జరిగిందని వైసిపి ఆరోపణలు చేస్తోంది.వైసీపీ అవినీతి మయమైన పాలన అందించిందని నేడు టీడీపీ ప్రతిదాడి చేస్తోంది. ఎత్తిపోతల పేరుతోనూ ఇదే తంతు నడిచిందనే విమర్శలు గత చంద్రబాబు ప్రభుత్వంపైన వచ్చాయి. అనవసరంగా ఎత్తిపోతల పేరుతో కోట్లాది రూపాయలు వృధా చేశారని,అసలు ఆ డబ్బుతోనే ప్రాజెక్టు పూర్తి చేయవచ్చనే విమర్శలూ ఉన్నాయి. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత, వాళ్ళ అనునాయులకే ప్రాజెక్టులు కేటాయించారని తెలుగుదేశం విమర్శిస్తోంది.ఈ విమర్శలు, రాజకీయాలు పక్కనే పెడితే, పోలవరం ప్రాజెక్టు సత్వరమే పూర్తి కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.గతం ప్రభుత్వం తప్పులు, ఇప్పటి ప్రభుత్వం తప్పులు, కేంద్ర ప్రభుత్వం తప్పులు అంటూ... ఒకరినొకరు ఆడిపోసుకోవడం వల్ల కాలయాపన తప్ప ప్రజలకు ఎటువంటి ప్రయోజనం వనకూరదు.అవినీతి జరిగివుంటే, విచారణ నిజాయితీగా జరిగితే, దోషులకు తగిన సమయంలో పడాల్సిన శిక్షలు పడతాయి. పడి తీరాలి కూడా. ప్రస్తుత అంశం,ప్రాజెక్టు పూర్తి చెయ్యడమే.కేంద్ర ప్రభుత్వం డబ్బులు లేవంటోంది,రాష్ట్ర ప్రభుత్వం దగ్గర అస్సలు డబ్బులే లేవు.అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వమే చొరవ తీసుకొని, ప్రపంచ బ్యాంకు నుంచో, ఆసియన్ డెవలెప్ మెంట్ బ్యాంకు నుంచో, ఏవో బ్యాంకుల నుంచి కేంద్ర ప్రభుత్వం హామీగా ఉండి ప్రాజెక్టుకు నిధులు సమకూర్చడమే ముందున్న ప్రధాన కర్తవ్యం.ఇంతవరకూ ఎంత శాతం పని పూర్తయింది,ఎంత ఖర్చయింది,కేంద్ర ప్రభుత్వం ఎంత ఇచ్చింది,ఆ డబ్బు ఏ విధంగా ఇప్పటి వరకూ ఖర్చు పెట్టారు, ఇంకా జరగాల్సిన పని ఎంత, ఎంత ఖర్చు అవుతుంది, ఎంత సమయం పడుతుంది అనే అంశాలపై కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సమీక్ష నిర్వహించాలి. తొలిగా కేంద్ర,రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రులు,అధికారులు సమావేశమవ్వాలి.తర్వాత ప్రధాన మంత్రితో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి భేటీ అవ్వాలి.ప్రస్తుతానికి కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల మధ్య, బిజెపి-టీడీపీ మధ్య, ప్రధానమంత్రి నరేంద్రమోదీ- ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్య స్నేహపూర్వక వాతావరణమే నడుస్తోంది. తరుణంలో ఇద్దరూ కలిసి సాగాలి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా కేంద్రానికి అప్పచెప్పడమే సరియైన పద్ధతి.వారు ఏ కాంట్రాక్టర్ కు ఈ ప్రాజెక్టును కేటాయించినా, బడ్జెట్ విషయం ఎంతైనా, పూర్తిగా కేంద్ర నిర్ణయానికి వదిలివెయ్యడమే వివేకమైన చర్య. ఇది తప్ప ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి ఇంకొక మార్గం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో బిజెపి తన బలాన్ని పెంచుకోవాలనే ఆలోచనలో ఉంది.ప్రత్యేక హెూదా ఇవ్వలేదనే కోపం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఉంది. 2019 ఎన్నికల్లో బిజెపికి ఘోరమైన ఫలితాలు రావడానికి ప్రత్యేక హెూదా కూడా ఒక ప్రధానమైన కారణమే. ఆంధ్రప్రదేశ్లో బిజెపి బలపడటానికి పోలవరం ప్రాజెక్టును ఒక బలమైన ఆయుధంగా ఉపయోగించుకోవచ్చని కొందరు రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.ఈ అంశంలో అధికారంలో ఉన్న టీడీపీ,బిజెపి రాష్ట్ర నాయకులు వ్యూహాత్మకంగా ముందుకు సాగి,కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసుకోవడమే శరణ్యం. జనసేన నేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ముఖ్యభూమిక పోషించాలి. ఢిల్లీలో తనకున్న పరపతిని ప్రయోగించాలి. ఇలా చేస్తే జనసేనకు, అధినేతకు మంచి జరుగుతుంది. ఇది అనుకున్న ట్లుగా పూర్తయితే కోట్లాది మంది ప్రజలతో పాటు, కూటమి మొత్తానికి ఆయా స్థాయిల లో రాజకీయ మైన ప్రయోజనం (పొలిటికల్ మైలేజ్) నెరవేరుతుంది. అటు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ-ఇటు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చరిత్రలో మిగిలిపోతారు.

# ప్రపంచ దృష్టిని ఆకర్షించిన ఆగస్టు విప్లవం



భారతదేశ స్వాతంత్ర్య సమరంలో దేశవ్యాప్తంగా శ్వేతజాతీయుల పాలనకు వ్యతిరేకంగా చేపట్టిన "ఆగస్టు విప్లవం"గా పేరు గాంచిన అహింస, అవిధేయత యుత ఉద్యమం ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించింది. భారత జాతీయ ఉద్యమం అనేకానేక దేశాల వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలకు ఉత్తేజకంగా నిలిచింది. 1867లో దాదాభాయి నౌరోజి ఈస్ట్ ఇండియా కంపెనీ (భారతీయ తూర్పు సంఘం) స్థాపించారు. సురేంద్రనాథ్ బెనర్జీ ఇండియన్ నేషనల్ అసోసియేషన్ (భారత జాతీయ సంఘం)ను స్థాపించడం జరిగింది. పదవీ విరమణ చేసిన బ్రిటన్ ప్రభుత్వ ఉద్యోగి ఆలన్ హ్యూమ్ ప్రోత్సాహంతో ముంబాయిలో సమావేశమైన 73 మంది భారత ప్రతినిధులు, భారత జాతీయ కాంగ్రెస్ కు అంకురార్పణ గావించారు . పాశ్చాత్య విద్యాభ్యాసకులైన వారు , పాత్రికేయ, విద్యారంగ ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీలో సిద్ధాంతాలు లేకుండా బ్రిటిష్ పాలన పట్ల సానుకూలత వ్యక్త పరిచారు . తమ తీర్మానాలను వైస్రాయ్, కొన్ని సార్లు బ్రిటిష్ పార్లమెంటుకు పంపడానికి పరిమితమైనారు. నిజానికీ కాంగ్రెస్ నాడు నగరాలలో నివసించిన శిష్ట జన వర్గానికి మాత్రమే పరిమితమైంది. కాంగ్రెస్ వాదులు తమను తాము స్వామి భక్తులుగా భావిస్తూ, బ్రిటిష్ సామ్రాజ్య భాగంగానే, తమ దేశ పరిపాలనలో భాగస్వామ్యాన్ని ఆశించి మాత్రమే, కార్యకలాపాలు కొనసాగించారు. దాదా భాయి నౌరోజీ బ్రిటీషు వారి హౌస్ ఆఫ్ కామన్స్ కు పోటీ చేసి, గెలిచిన "ప్రప్రథమ భారతీయుని"గా నిలిచారు. తిలక్ మొదటి సారిగా "స్వాతంత్ర్యం నా జన్మ హక్కు" అని ఎలుగెత్తి నినదించిన జాతీయ వాది. తిలక్, భారతీయ సంస్కృతిని, చరిత్రను , విలువలను నిర్లక్ష్యం చేస్తూ, కించపరిచిన బ్రిటిష్ విద్యా వ్యవస్థను తీవ్రంగా నిరసించారు. జాతీయ వాదులకు భావ ప్రకటనా స్వేచ్ఛ లేకుండడాన్ని సహించ లేక పోయాడు. అందుకే స్వరాజ్యమే ఎకైక మార్గమని నమ్మాడు. ప్రజలు , బ్రిటిష్ వారిపై తిరగబడడమే స్వరాజ్య సాధనా మార్గమని విశ్వసించాడు. బిపిన్ చంద్ర పాల్, లాలా లజపతిరాయ్ లు, తిలక్ ను సమర్ధించారు. లాల్, బాల్, పాల్ జాతీయ వాదానికి రూపు రేఖల కల్పనలో కృతకృత్యులు కావడం, గాంధీజీ దక్షిణ ఆఫ్రికా నుండి భారత్ రాక, అనంతర సత్యాగ్రహ ఉద్యమ ఆచరణ , అహింసా పూరిత సహాయ నిరాకరణ ఉద్యమ ఫలితంగా లక్షలాది మంది భారతీయులలో పోరాట స్ఫూర్తిని తేగలిగింది. 1919 ఏప్రిల్ 13 నాటి ఆందోళన , జలియన్ వాలా బాగ్ (అమృత్సర్ మారణకాండ) దురంతం డయ్యర్ నేతృత్వంలో 1651 రౌండ్ల కాల్పులకు379 మంది మరణించినట్లు, 1137 మంది గాయాల పాలైనట్లు బ్రిటిష్ అధికారుల, 1499 మంది మృతి చెందిన, భారతీయుల అంచనా సంఘటన, దేశవాసులు క్రోధాగ్నికి రగిలింప చేసింది. మొదటి సహాయ నిరాకరణ 1920 లో స్వరాజ్య సాధనా లక్ష్యంతో కాంగ్రెస్ పునర్ వ్యవస్థీకరణ, 1922 లో గాంధీ 2 ఏళ్ల కారాగార వాసం, 1928లో సైమన్ కమిషన్ సిఫార్స్ తిరస్కరణ, భారత రాజ్యాంగ నిర్మాణానికి, మోతీలాల్ నెహ్రూ ఆధ్వర్యంలో ముసాయిదా సంఘ ఏర్పాటు, 1929 డిసెంబర్ లోగా స్వపరి పాలన హెూదా ఇవ్వకుంటే, సత్యాగ్రహ ఉధృత తీర్మానాలు , పెరిగిన రాజకీయ అసంతృప్తి , లాహెూర్ లో జరిగిన చారిత్రాత్మక సమావేశంలో సంపూర్ణ స్వతంత్ర సాధన పిలుపుకు క్రమానుగత హేతువులైనాయి. 1930 జనవరి 26న దేశం మొత్తం సంపూర్ణ స్వాతంత్ర్య దినం పాటించాలని నిర్ణయమైంది. దేశ రాజకీయ వాదులు , విప్లవకారులు ఒక్కటి కావడానికి ఈ నిర్ణయం కారణభూతమైంది. 1930 మార్చి 22 నుంచి ఏప్రిల్ 6 వరకు ఉప్పు సత్యాగ్రహంగా విలువబడే 400కి. మీ .ల కాలినడక దండి యాత్ర, 1931లో గాంధీ – ఇర్విన్ ఒప్పందం కుదిరినా , భగత్ సింగ్ ఆయన ఇరు సహచరులు సుఖదేవ్, రాజ గురులకు మరణ శిక్షలతో దేశవ్యాప్త నిరసనలు వెల్లువెత్తాయి. 1932 లో గాంధీ తిరిగి సత్యాగ్రహాన్ని చేపట్టారు. అనంతర పరిణామాలలో ఇలా దశాబ్దకాలం పాటు కొనసాగిన వివిధ రూప ఆందోళనలు , సత్యాగ్రహాలు, నిరసనలు, బాంబుల దాడులు , దహనాలు క్రమంలో 1942 ఆగస్టు,8 న చారిత్రాత్మక సంఘటనలో ముంబాయి గొవాలియా ట్యాంక్ మైదానంలో "కరో యా మరో" అని నినదించిన గాంధీజీ, భారత దేశం విడిచి పోవాలని (క్విట్ ఇండియా ) హెచ్చరిక జారీ చేస్తూ, ఉద్యమ ఉధృతికి శ్రీకారం చుట్టారు. ఆగస్టు 9న ఉద్యమం ప్రారంభమైంది. సుదీర్ఘ అహింసాయుత ఉద్యమాల ఫలితంగా 1947 ఆగస్టు 15న భారతీయుల చిరకాల స్వప్నం సాకారమైంది. స్వాతంత్ర్యం సిద్ధించింది.

# మహోన్నత చిత్రాల మాటల మాంత్రికుడు మోదుకూరి జాన్సన్



తెలుగు చలన చిత్ర రంగంలో రచయితగా మోదుకూరి జాన్సన్ పాత్ర విశిష్టమైనది. 'మరో ప్రపంచం', 'మానవుడు – దానవుడు', 'డబ్బుకులోకం దాసోహం', 'దేశోద్ధారకులు', 'బంగారు భూమి', 'కరుణామయుడు', 'దేవాలయం', 'నేటి భారతం' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలకు మాటలను, 'మన జన్మభూమి బంగారు భూమి'(పాడి పంటలు), 'కదిలింది కరుణ రథం..'(కరుణామయుడు) వంటి హిట్ చిత్రాలను , పాటలను రచించిన మోదుకూరి జాన్సన్ కు అందరికి మల్లే పెద్దగా ప్రాచుర్యం లభించలేదు. దీనికి కారణాలు అనేకం ఉండి ఉండవచ్చు. కానీ తెలుగు చిత్రసీమ ఓ ప్రతిభ గల రచయితను మరుగుపెట్టిందనడంలో ఎంత మాత్రం సాహసించనక్కర్లేదు. ఈరోజుల్లో ఒకటి రెండు చిత్రాలు చేసిన వారు సైతం గొప్పగా చెప్పుకుంటూ, కావల్సినంత ప్రచారం చేసుకుంటున్నారు. అయితే దాదాపు రెండు దశాబ్దాల పాటు చిత్ర రంగాన ఉండి, విజయవంతమైన అనేక చిత్రాలకు మాటలు, పాటలు అందించిన మోదుకూరి జాన్సన్ కు మాత్రం పెద్దగా పేరు ప్రతిష్టలు రాకపోవడం విచారకరం. విజయవంతమైన అనేక చిత్రాలకు ప్రాణం పోసిన ఆయన ఓ సీదాసాదా జీవితాన్ని అనుభవించారు. అయితే తన పదునైన కలంతో ఆలోచింపచేసే మాటలను, పాటలను, సినీ సన్నివేశాలను సృష్టించి తెలుగు చిత్ర సీమలో తనకంటూ ఓ ప్రత్యేకమైన ఇమేజ్ ను సాధించారు. మోదుకూరి జాన్సన్ గుంటూరు జిల్లా కొలకలూరు గ్రామంలో 1936, ఆగష్టు 8 తేదీన రత్తమ్మ గురవయ్య (పేతురు) దంపతులకు జన్మించారు. వీరు ప్రాథమిక విద్యాభ్యాసం దుగ్గిరాల, గుంటూరులో సాగింది. ఆంధ్ర విశ్వ కళా పరిషత్ నుంచి డిగ్రీ తీసుకున్న ఆయన తెనాలి లో కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. ఆయనకు నాటకాలంటే పిచ్చి. ఆ క్రమంలోనే ఆయన నటనాలయం, దేవాలయం, హృదయాలయ, సిలువభారం తదితర నాటకాలు రాసి ప్రదర్శించారు. ధక్కాభిషేకం నవల రాశారు. రాగ హృదయం అనే రూపకానికి నేపథ్యగానం అందించారు. ఛండాలిక, పైరుపాట సంగీత రూపకాలకు సంగీత దర్శకత్వం వహించారు. ఢిల్లీలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయ యువజనోత్సవాలలో పాల్గొని బహుమతులు అందుకున్నారు. మోదుకూరి రాసిన నటనాలయం నాటకం అప్పట్లో ఎంతో పేరు తెచ్చుకుంది. ఆ నాటకం చూసి అక్కినేని నాగేశ్వరరావు – ఆదుర్తి సుబ్బారావు లు తమ సొంత చిత్రమైన మరో ప్రపంచం చిత్రానికి సంభాషణల రచయితగా ఆయనకు అవకాశం ఇచ్చారు.అనంతరం ఆయన దాదాపు 50 చిత్రాలకు పైగా మాటలు సమకూర్చారు. మాటలతో పాటు శ్రీ శ్రీ, దాసరథి, ఆరుద్ర వంటి ప్రముఖుల సరసన కొన్ని చిత్రాలకు పాటలను కూడా రాశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, కృష్ణంరాజు, విజయచందర్ చిత్రాలకు రచయితగా పనిచేశారు. పి.సి.రెడ్డి, టి.కృష్ణ, విజయనిర్మల కె.బాపయ్య దర్శకత్వంలో వచ్చిన సినిమాలకు, సురేష్ ప్రొడక్షన్స్, పద్మాలయ పిక్చర్స్, ఉషా శ్రీ పిక్చర్స్ సంస్థలు నిర్మించిన పలు చిత్రాలకు రచయితగా పనిచేసి తెలుగు సినీ ప్రపంచంలో రచయితగా ఓ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. ఆయన పని చేసిన చిత్రాలలో కరుణామయుడు (1978), ఇంద్రధనుస్సు (1978), మానవుడు - దానవుడు (1972), విచిత్ర దాంపత్యం (1971), డబ్బుకు లోకం దాసోహం (1973), ఆంధ్ర కేసరి, దేశోద్ధారకులు చిత్రాలకు మంచి గుర్తింపు వచ్చింది. కరుణామయుడు చిత్రం కోసం ఆయన రాసిన కదిలింది కరుణరథం సాగింది క్షమా యుగం అనే పాట ఎప్పటికీ ఆల్ టైమ్ రికార్డుగా మిగిలిపోయింది. ఆ చిత్రానికి ఆ పాటే గుండె కాయ. 1978 డిసెంబర్లో విడుదలైన 'కరుణామయుడు' అప్పట్లో పెద్ద హిట్ గా నిలిచింది. ఆ తరువాత 'దయామయుడు', 'ఆంధ్రకేసరి' చిత్రాలకూ కూడా మోదు కూరే రచయితగా పని చేశారు. అలాగే, బాపు-రమణల 'రాజాధిరాజు'లో ఆయన రాసిన 'రాజ్యము బలము మహిమ నీవే నీవే...' పాట కూడా బహుళ ప్రాచుర్యం పొందింది. అలాగే పాడిపంటలు చిత్రం కోసం ఆయన రాసిన మన జన్మభూమి బంగారు భూమి, దేశోద్ధారకులు చిత్రం కోసం ఆయన రాసిన స్వాగతం దొరా.. పాటలు మంచి గుర్తింపు పొందాయి. నటుడిగా ,సంగీత దర్శకుడి గా , రచయితగా ఇలా అనేక చిత్రాలకు పని చేసిన ఆయన జాన్సన్ 1988 వ సంవత్సరం డిసెంబరు 24 తేదీన 52 ఏళ్ళకే గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన మరణించి 35 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ జాన్సన్ తన మాటలు, పాటల ద్వారా చిరస్మరణీయుడుగానే ఉన్నారు. ఆయన లేని లోటు ఎన్నటికీ చిత్ర రంగంలో తీర్చలేనిది.

# మహిళలకు స్ఫూర్తి ప్రదాత సూర్యదేవర రాజ్యలక్ష్మి



శతాబ్దాల శ్వేత జాతీయుల పాలనలో అష్టకష్టాలు అనుభవించి, ఆంగ్లేయుల దాస్య శృంఖలాలను తెంచు కునేందుకు ఎందరో పోరాట పటిమను, తెగువను చూపించారు. భారత స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించారు. తమ సర్వస్వం స్వాతంత్ర సాధనకోసం త్యాగం చేసిన వారు ఎందరో ఉండగా, మగ వారితో సమానంగా కొంత మంది మహిళలు కూడా తెగించి స్వేచ్ఛా భారతం కోసం పోరాటం సల్పిన ఘన చరిత్ర ఉంది. సాంప్రదాయాలకు, కట్టుబాట్లకు అధిక ప్రాముఖ్యత ఇచ్చే రోజుల్లో మహిళలు స్వతంత్ర పోరాటంలో పాల్గొని భారతదేశ పౌరుషాన్ని చాటిన సందర్భాలు మరచి పోలేనివి. తాము అబలలము కామని, త్యాగాలకు వెరవమని నిరూపించి, తెగించి బ్రిటీషర్లతో పోరాడారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాము లయ్యారు. అలాంటి వారిలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు, సంఘ సేవకు రాలు సూర్యదేవర రాజ్యలక్ష్మి దేవి ముఖ్యులు.సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి (మే 18, 1914 – ఆగష్టు 8, 2010) కృష్ణాజిల్లా నందిగామ తాలూకా వీరుల పాడులో మే 18, 1914లో వాసిరెడ్డి సీతా రామయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. ఆమె గురువు అతను కవి, పండితుడు జంగా హనుమ య్య చౌదరి ఉత్తమ విషయ పరిజ్ఞానాన్ని బోధించి, విద్వత్తు కలిగించారు. సూర్య దేవర నాగయ్యతో రాజ్యలక్ష్మీ దేవికి పదేళ్ళ వయస్సులో వివాహ మై, ఆమెక 16 ఏళ్ళకు అత్తవారింటికి వచ్చేవరకు విద్యా వ్యాసంగాలు కొన సాగించారు. వీరులపాడులో గ్రంథాలయాన్ని వినియోగించు కుని, తాపీధర్మారావు, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, త్రిపురనేని రామ స్వామి చౌదరి వంటి సంఘ సేవకులు రచించిన గ్రంథాలను రాజ్యలక్ష్మీదేవి ప్రతి రోజూ తెచ్చుకుని చదివి అవగాహన చేసుకునేవారు. ఇవన్నీ ఆమెలో స్వతంత్ర్య భావాలను, స్వేచ్ఛాభిలాషను పెంచాయి.1920లో గాంధీజీ ఇచ్చిన పిలుపు విని దేశసేవకు నడుం బిగించారు. 1930లో ఉప్పు సత్యా గ్రహంలో పాల్గొనాలని అనుకున్నా, ఆమె జైల్లుశిక్ష అనుభవించటానికి, సత్యాగ్రహం చేయటానికి భర్త, ఇంట్లో పెద్దలు అంగీకరించలేదు. రాట్నంపై నూలు వడకటం, హిందీ నేర్చుకోవటం, ఖాదీ ధారణ అక్కడ పరిపాటి. ఉద్యమం ప్రచారం చేస్తూ రాజ్యలక్ష్మీదేవి దగ్గర బంధువెట్కన అన్నపూర్ణమ్మతో శాసనోల్లంఘన చేయతల పెట్టారు. జాతీయ గీతాన్ని ఆలపిస్తూ శాసనధిక్కార నినాదాలు ఊరేగింపుగా వెళ్లగా పోలీసులు అరెస్టు చేశారు.శిక్ష గురించి న్యామూర్తుల ఇళ్ళలో సైతం స్త్రీలు వీరికి అండగా నిలవడంతో ఆ శిక్ష రద్దు చేసి నామమాత్రపు శిక్షను విధించగా, రాజ్యలక్ష్మీదేవిని రాయవేలూరు జైల్లుకు తరలించారు. రాజ్యలక్ష్మి ఖాదీ ప్రచారం, మహిళా ఉద్యమం, రాజకీయ కార్యకలాపాలు కొనసాగిస్తూ, కష్టపడి చదివి రాష్ట్రభాష పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు.అస్పృశ్యతా నివారణ కోసం ఆమె తన వంతు కృషి చేశారు. హరిజన స్త్రీలను అందరితో పాటు గౌరవించేవారు. 1940లో వ్యక్తి సత్యాగ్రహం ఆరంభమైంది. గుంటూరు జిల్లాలో ఆ సత్యా గ్రహం చేయడానికి అనుమతి లభించిన తొలిస్త్రీ రాజ్యలక్ష్మి. 1941 జనవరి 30లో బాపట్ల తాలూకాలోని బ్రాహ్మణ కోడూరులో ఆమె సత్యాగ్రహం చేశారు. పోలీసులు అరెస్ట్ చేసి, రెండు నెలల జైల్లు శిక్ష, వందరూపాయల జరిమానా విధించారు.ఆమె జైల్ల నుండి విడుదలెట్క మద్రాసులోని ఆంధ్ర మహిళా సభకు చేరుకున్నారు. తరువాత తెనాలి వెళ్ళి ట్యుటోరియల్ కాలేజిలో చేరి బెనారస్ మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఆమె చేబ్రోలు కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉండి మహిళా భ్యున్నతికి దేశాభ్యుదయానికి పాటు పడ్డారు. క్విట్ ఇండియా ఉద్యమంలో రాజ్యలక్ష్మీదేవిని శాసనధిక్కార శాఖ సభ్యురాలిగా నియమించారు. ఆమె రహస్యంగా జిల్లాలన్నీ తిరిగి ప్రజలచే శాసన ధిక్కారం చేయించారు. పోలీసుల నుండి ఆమెను దేశభక్తులు కాపాడే వారు. రాజ్యలక్ష్మీదేవి 1941లో చేబ్రోలులో జాతీయ మహిళా విద్యాలయాన్ని స్థాపించారు. ఆ తరువాత అక్టోబరు 1945లో ఆంధ్ర రాష్ట్ర మహిళా రాజకీయ పాఠశాలను ప్రారంభించారు.భారత దేశానికి 1947 ఆగష్టు 15వ తేదీన స్వాతంత్ర్యం సిద్ధించినా, నెట్కజాము ఏలు బడిలో ఉన్న వారికి విముక్తి కలగలేదు. రాజ్యలక్ష్మీదేవి విరాళాలు, చందాలు పోగుచేసి నెట్కజాం వ్యతిరేక పోరాట నాయకు లకు తమ సంఘీభావాన్ని తెలిపారు. రాజ్యలకీదేవి వ్యక్తి గతంగా నెట్కజాం వెళ్ళి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాదు సంస్థానం స్వతంత్ర భారత దేశంలో విలీనమయ్యే వరకు ఆమె అక్కడి వారితో కలసి పోరాటం సాగించారు. 1950లలో తెలుగు దేశం అనే పత్రిక నడిపారు. మహిళా భ్యుదయ సంస్థలో మల్లాది సుబ్బమ్మ తదితరు లతో కలిసి మద్యపానానికి వ్యతిరేకముగా పోరాటం చేశారు. రాజ్యలక్ష్మి ఆగష్టు 8, 2010 న మరణించారు.

# భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపొందించండి..

## స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో ప్రణాళిక రూపొందించాలి..

## ప్రజల సామాజిక అవసరాలను దృష్టిలో పెట్టుకోండి: జిల్లా కలెక్టర్ డా. జి. సృజన





**విజయవాడ,ఆగస్టు7,(ఆంధ్రపత్రిక):** ప్రజలకు పూర్తి మౌలిక వసతులను కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర ముఖ్య మంత్రి ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు భవిష్యత్ అవసరాలు ప్రజల సామాజిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రామ సమగ్రాభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అధికారులను ఆదేశించారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి చేపట్టవలసిన ప్రణాళికలపై బుధవారం జిల్లా కలెక్టర్ జి. సృజన కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామాలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ముఖ్య మంత్రి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేకంగా ప్రస్తావించి దిశ నిర్ధేశం చేయడం జరిగిందన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడంలో అధికారుల ఆలోచన విధానంలో మార్పు రావాలన్నారు. ప్రజల ప్రస్తుత సామాజిక అవసరాలతో పాటు భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి రాబోయే మూడు సంవత్సరాలలో చేపట్టి పూర్తి చేయాల్సిన పనుల నివేధికను రూపొందించాలన్నారు. మౌలిక వసతుల్కెన రహదారులు, డ్రైయి న్లు, వీధి దీపాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి దశల వారిగా కలర్ కోడ్‌లతో ప్రతిపాదనలు రూపొందించా లన్నా రు. ప్రస్తుతం చేపట్టి పూర్తి చేయాల్సిన పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. 2025 మార్చి నాటికి ప్రతి ఇంటికి త్రాగునీటి కుళాయిలను ఏర్పాటు చేసే లక్ష్యాన్ని దృష్టి లో పెట్టుకోవాలన్నారు. డ్రైయిన్ల నిర్మాణంలో శాస్త్రీయ దృక్పధాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. జాతీయ ఉపాధి హామి పథకం కింద ఈ ఏడాది ఇంకనూ 22 లక్షల పనిదినాల లక్ష్యం ఉందన్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు నెలకు 3 లక్షల పని దినాలను కల్పించే ఒదుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధి హామి పనులలో కూలీల ను పెద్ద ఎత్తున భాగస్వామ్యులను చేసి పని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని పనుల ప్రగతిని ప్రతి రోజు టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తానన్నారు. ప్రతి మండలానికి కేటాయిం చే నిధులతో పాటు, డియంఎఫ్ నిధులను కూడా వినియోగించేలా చర్యలు తీసు కోవాలన్నారు.

గ్రామాల సామాగ్రాభి వృద్ధికి ప్రభుత్వ ఆలోచ నలకు అనుగుణంగా సేవలందించి అభివృద్ధిలో అధికారులు భాగ స్వామ్యులు కావాలని కలెక్టర్ జి. సృజన సూచించారు. సమావేశంలో డ్వామా పిడి జె. సునీత, పంచాయతీ రాజ్ ఎస్ఇ అక్కినేని వెంకటేశ్వరావు, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఇ డివి రమణ, జిల్లా పంచాయతీ అధికారి ఎన్. వి.శివ ప్రసాద్ యాదవ్, డిఆర్‌డిఏ పిడి కె. శ్రీనివాసరావు, రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామా అధికారులు పాల్గొన్నారు.

### తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ చొరవతో

# ప్రభుత్వ మహిళా కళాశాలకు మహర్దశ



**గుంటూరు,ఆగస్టు7,(ఆంధ్రపత్రిక):** గుంటూరులోని ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో నాడు నేడు నిధుల ద్వారా మంజూరైన పనులు మధ్యలోనే ఆగిపోగా, వాటిని పూర్తి చేయుటకుగాను 24 లక్షలు రూపాయలు ASFF నిధులు వాడుకొనుటకు పరిపాలన ఆమోదం ఇచ్చినట్లు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. గతంలో నాడు - నేడు నిధులు ద్వారా లెక్చలర్లకు, విద్యార్థులకు, అవసరమైన 29 టాయిలెట్స్ నిర్మాణం చేపట్టగా, నిధులు కొరతతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. పది రోజుల క్రితం ఎమ్మెల్యే నసిర్ ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలను సందర్శించగా, ప్రిన్సిపల్ ,లెక్చరర్స్, ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా గత నెల అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యే నసీర్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి లేఖ ద్వారా తెలియపరిచి ఉన్నారు. దానిని ఫాలో ఆఫ్ చేయగా, వెంటనే 24 లక్షల రూపాయలు ASFF నిధులు వాడుకొనుటకు ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారు. కావున వెంటనే విద్యార్థులకు అవసరమైన టాయిలెట్స్ నిర్మాణం పూర్తి చేయటానికి అవకాశం వచ్చింది.

కావున అడిగిన వెంటనే స్పందించి సకాలంలో అనుమతులు ఇప్పించిన ఎమ్మెల్యే నసీర్ ని మహిళా కళాశాల ప్రిన్సిపల్ సునీత , లెక్చరర్లు అభినందించారు.

# కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం





**గుంటూరు,ఆగస్టు7,(ఆంధ్రపత్రిక):** బుధవారం గుంటూరు శివారులో నెలకొన్న కళ్ళం హరనాథరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు అవగాహన సదస్సు ను జరుపుకున్నారని కళాశాల డైరెక్టర్ డా యం ఉమాశంకర రెడ్డి తెలిపార. ఈ అవగాహన సదస్సు కు కళాశాల చైర్మన్ కళ్ళంమోహన్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ కళ్ళం గ్రూపు సంస్థలు స్థాపించిన కళ్ళం హరనాథరెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో ప్రవేశం పొందిన విద్యార్థులు మరియు విద్యార్థినుల కు శుభాకాంక్షలు తెలిపారు. అత్యున్నత సాంకేతిక విద్య మరియు ఉపాధి కల్పన ముఖ్య ధ్యేయంగా మా కళాశాల పనిచేస్తున్నది అని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో 1200 మందికి పైగా ఇంజనీరింగ్ డిగ్రీ లో ప్రవేశాలు జరిగాయని మరియు గుంటూరు జిల్లా లోనే ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలో కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల అత్యున్నత సాంకేతిక విద్య ను అందిస్తున్న ఏకైక స్వయం ప్రతిపత్తి హోదా కలిగిన కళాశాల గా ఉండటం చాలా గొప్పదనము అని కళాశాల ప్రిన్సిపాల్ డా బి యస్ బి రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం మా కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందిన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఈరోజు 7 వ తేదీ నాడు మరియు కంప్యూటర్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ , మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ,డేటా సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకు 8 వ తేదీన అవగాహన సదస్సు ను జరుపుకున్నారని కళాశాల డైరెక్టర్ డా యం ఉమాశంకర రెడ్డి తెలిపారు.

ఈ అవగాహన సదస్సులో కళాశాల వైస్ చైర్మన్ పి వేంకటేశ్వర రెడ్డి, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కళ్ళం నవ్య, కళాశాల ఉపాధి కల్పన అధికారి డా పి ఎల్ మాధవరావు, ఇంజనీరింగ్ విభాగాధిపతులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారతీయ వస్త్ర కళకు ప్రాణం పోసే చేనేత అభివృద్ధికి భారత ప్రధాని నరేంద్ర మోడీ కృషి



**గుంటూరు,ఆగస్టు7,(ఆంధ్రపత్రిక):** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి లో ని లక్ష్మి శారీస్ నందు సీనియర్ నేతన్న పొన్నబత్తుని లక్ష్మణరావు దంపతులను గుంటూరు మహిళా మోర్చా తరుపున సత్కరించుకుని వారి దగ్గర పని చేస్తున్న సుమారు 100 మంది నేత కార్మికులకు ప్రధాన మంత్రి సురక్ష భీమా గురించి వివరించి భీమా చేసుకునేందుకు సహాయం చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు జోనల్ ఇన్చార్జి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, జిల్లా ఇన్చార్జి రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర డా శనకాయల అరుణ సమక్షంలో గుంటూరు మహిళా మోర్చా అధ్యక్షులు నడ్డి నాగమల్లేశ్వరి, ఉపాధ్యక్షులు సాధు వాణి, విద్యారాణి, కోశాధికారి స్రవంతి, నాగమల్లేశ్వరి, లక్ష్మి,కుమారి, రమాదేవి, కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించి తదుపరి మధ్యాహ్నం 3 గం?కు బండ్లమూడి హనుమయమ్మ పాఠశాల లో చేనేత వస్త్రధారణ పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం నిర్వహించడం జరిగింది. చేనేత కళాకారుల కష్టాలు సమస్యలపై పూర్తి అవగాహన తొ మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే కళను చేనేతరంగానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రధాన నరేంద్ర మోడీ అడుగులు వేస్తున్నారని తీసుకొస్తామని చేనేత రంగం, కార్మికుల సమస్యలన్నీ శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ఓ ప్రణాళిక రూపొందిస్తోంది అని మన మంగళగిరి-మన చేనేత అనే నినాదంతో దేశవ్యాప్తంగా మన చేనేత వస్త్రాలకు బ్రాండింగ్ కల్పిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమం లో మహిళా మోర్చా గుంటూరు అధ్యక్షులు నడ్డి నాగమల్లేశ్వరి బహుమతి ప్రదానం చెయ్యగా మహిళా మోర్చా సభ్యులు స్రవంతి లక్ష్మీ, మహాలక్ష్మి, కుమారి పాఠశాల అధ్యాపకులు సీత పాల్గొని గెలుపొందిన విద్యార్థినులను అభినందించారు.

ఈ రోజు జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి లో ని లక్ష్మి శారీస్ నందు సీనియర్ నేతన్న పొన్నబత్తుని లక్ష్మణరావు దంపతులను గుంటూరు మహిళా మోర్చా తరుపున సత్కరించుకుని వారి దగ్గర పని చేస్తున్న సుమారు 100 మంది నేత కార్మికులకు ప్రధాన మంత్రి సురక్ష భీమా గురించి వివరించి భీమా చేసుకునేందుకు సహాయం చేయటం జరిగింది.

## 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



**విజయవాడ,ఆగస్టు7,(ఆంధ్రపత్రిక):** నెల 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించే వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మం త్రులు, అధికారులు హాజరు కానున్న దృష్ట్యా చేయవలసిన ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, మున్సిపల్ కమిషనర్ హెచ్‌ఎం. ధ్యాన చంద్ర, డ్వామా పిడి, ఇన్చార్జి గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి జె సునీత పరిశీలించారు.

## రోడ్డు సేఫ్టీ మొబైల్ 7 సిబ్బంది ,రాజ్ కుమార్ సిబ్బంది సేవలకు అభినందలు



**నూజివీడు ,ఆగస్టు7, (ఆంధ్ర పత్రిక):** రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బంది రాజ్కుమార్ కానిస్టేబుల్ ఎంతోకాలం నుంచి ఈ హైవే పెట్రోల్ డ్యూటీ లో తన చేతుల మీదగా ఎన్నో ప్రాణాలు కాపాడిన ఈ కానిస్టేబుల్ కు ప్రజల అభినందనలు తెలుపుతున్నారు. కానిస్టేబుల్ రాజ్ కుమార్‌ను తన సేవలను గుర్తించి ప్రజలందరూ కూడా అతనికి అభినందనలు తెలుపు కున్నారు .నిన్న ఉదయం 6:30 ప్రాం తంలో ఏలూరు జిల్లా నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల మీర్జాపురం గ్రామంలో హై స్కూల్ వద్ద ఎదురు ఎదురుగా వస్తున్న రెండు లారీలు ఢీ కొనగా ఈ ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్లు మోకాళ్లు లారీలు ఇరుక్కుపోయిన సంఘటనం గురించి సమాచారం తెలుసు కున్న వెంటనే రోడ్డు సేఫ్టీ మొబైల్ 7 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, హైవే సిబ్బంది క్రేన్ సహాయంతో యాక్సిడెంట్లు అయిన లారీ లోని డ్రైవర్లను బయటకు తీసి, హాస్పిటల్కి తరలించారు.సదరు రోడ్డు ప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే స్పందించి ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా క్షతగాత్రులను వెనువెంటనే చికిత్స కొరకు హాస్పిటల్ కుతరలించిన విషయంపై ప్రజలు పోలీసు వారిని అభినందించినారు.

## శామ్‌సంగ్ నుంచి ఇండియా నిర్దిష్ట ఏఐ వాషింగ్ మెషీన్లు




**విజయవాడ,ఆగస్టు7,(ఆంధ్రపత్రిక):** భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, భారతీయ మార్కెట్ కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన దాని రాబోయే ఏఐ-ఆధారిత లాండ్రీ స్పెషలిస్ట్‌ను ప్రవేశపెట్టింది. శామ్‌సంగ్ ఈ తాజా ఆవిష్కరణతో భారతీయ కస్టమర్లకు వాషింగ్ అనుభవాన్ని మార్చడానికి సిద్ధంగా ఉంది. రోజువారీ దినచర్యలలో అత్యాధునిక సాంకేతికతను సజావుగా అనుసంధానించే దాని సామర్థ్యంతో, ఏఐ శక్తితో కూడిన కొత్త వాషింగ్ మెషీన్ ప్రక్రియను సరళంగా, మరింత ప్రభావవంతంగా చేయడం ద్వారా లాండ్రీలో గొప్ప మార్పులకు హామీ ఇస్తుంది. శామ్‌సంగ్ సౌలభ్యాన్ని పునరుద్ధరించాలని, కస్టమర్‌లకు తక్కువతో ఎక్కువ కాలం మన్నే సామర్థ్యాన్ని అందించాలనే లక్ష్యానికి ఈ ఆవిష్కరణ అనుగుణంగా ఉంది.

## ఆగిరిపల్లి మండల తహసిల్దారుగా సిఎన్ .వి, ప్రసాద్



**ఆగిరిపల్లి,ఆగస్టు 7(ఆంధ్రపత్రిక):** ఆగిరిపల్లి మండల తహసిల్దారుగా సిఎన్ వి ప్రసాదు జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ సర్వేయర్లు శాలు వాతో సత్కరించారు ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ పవన్ కు మార్ నూతన తహసిల్దార్ గురించి మాట్లాడుతూ ఈయన కంకి పాడు నుంచి బదిలీ అయ్యి వచ్చారని, గతంలో నూజివీడు డివిజన్ సివిల్ సప్లై డీటీగా పని చేశారని, ఆగిరిపల్లి మండలం పై అవగాహన ఉందని తెలిపారు.

### శ్రీకృష్ణదేవరాయల పాలనలో అత్యున్నత స్థితికి

# విజయనగర సామ్రాజ్యం

### తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్



**గుంటూరు,ఆగస్టు7,(ఆంధ్రపత్రిక):** భారతదేశాన్ని పరిపాలించిన చక్రవర్తుల్లో గొప్ప చక్రవర్తిగా అభివర్ణించగల చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. బుధవారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అఖిల భారత కాపు సంఘం నేతలు ఏర్పాటు చేసిన ఏర్పాటుచేసిన శ్రీకృష్ణదేవరాయ పట్టాభిషేక మహోత్సవం మరియు ఎన్డీఏ కూటమి ప్రజా ప్రతినిధుల విజయోత్సవ సన్మాన సభ లో గుంటూరు తూర్పు శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్ పాల్గొన్నారు. ఆయనకు రాష్ట్ర కాపు సంఘ అధ్యక్షులు అమ్మ శ్రీనివాస్ నాయుడు మరియు కాపు నేతలు కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఎంతో ఘనంగా కాపు సంఘ నాయకులు అందరూ కూటమి ప్రజా ప్రతినిధులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే రాష్ట్రంలో గత ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల కాలంలో కాపులను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టి వారికి కాపు కార్పొరేషన్ అని మాయమాటలు చెప్పి నిధులు కేటాయించకుండా, ఆ నిధులను తన ఖజానాకు మళ్లించి, కాపులను మోసం చేసిన మోసగాడు ఈ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. అలాగే చంద్రబాబు ప్రభుత్వంలో కాపు రిజర్వేషన్ ప్రవేశపెడితే, దానిని పట్టించుకోకుండా కాపులను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టి రాజకీయంగా కాపులను గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి అణగదొక్కాడని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. అలాగే మన ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ నేతృత్వంలో, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నరేంద్ర మోడీ ఆశీస్సులతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని సామాజిక వర్గాలతో పాటు కాపు సామాజిక వర్గానికి పెద్ద పీట వేశారన్నారు. ఈరోజు సమాజంలో దాదాపు ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నటువంటి జనాభాలో సగభాగం ఉన్నటువంటి కాపు సామాజిక వర్గాన్ని అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించే విధంగా మా ప్రభుత్వం పనిచేస్తుందని అలాగే అన్ని సామాజిక వర్గాలకి సమాన ప్రాధాన్యత కల్పిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. వివిధ రాష్ట్రాల నుండి తరలివచ్చిన కాపు సోదరులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాపు జేసి రాష్ట్ర అధ్యక్షులు అమ్మ శ్రీనివాస్ నాయుడు, గుణ్ణం సాయిబాబు, పోతురాజు చంద్ర, రామ్మోహన్, పాకనాటి రమాదేవి, అనిల్ నాయుడు, దర్శి వెంకటేశ్వరరావు తదితర కాపు సోదరులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలు కొనసాగిస్తున్న మానవహననాన్ని వెంటనే నిలిపివేయాలి



**గుంటూరు,ఆగస్టు7,(ఆంధ్రపత్రిక):** ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర కార్పొరేట్ (కాషాయ) ప్రభుత్వ సాయుధ బలగా లు ఆపరేషన్ కగార్ పేరుతో కొనసా గిస్తున్న మానవహననాన్ని వెంటనే నిలిపివే యాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కో కన్వీనర్ బి కొండారెడ్డి అన్నారు. ఆగస్టు 9, 10 తేదీలలో హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగనున్న అఖిల భారత సదస్సు కరపత్రాలను స్థానిక అంబేద్కర్ భవన ప్రాంగణంలో వివిధ దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా కార్పొరేట్ శక్తులతో కుదుర్చుకున్న ఒప్పందాలలో భాగంగా ఛత్తీస్గఢ్ రాష్ట్రం లోని అనేక ఆదివాసీ గూడేలలో సాయుధ బలగాలను మోహరించిందన్నారు.

మావోయిస్టుల ఏరివేత పేరుతో గత ఏడు నెలలుగా ఆదివాసీలపై దాడులు, మహిళలపై అత్యాచార హత్యలకు పాల్పడు తుంద న్నారు.తల్లి ఒడిలో ఉన్న ఆరు నెలల పసిబిడ్డను కూడా వదలకుండా తుపాకులతో కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివాసీ ప్రాంతంలో సాయుధ బలగాలు కొనసాగిస్తున్న మానవహననాన్ని బైటి ప్రపంచానికి తెలియకుండా పత్రికల, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల గొంతు నొక్కుతు న్నారన్నారు. ఆదివాసీలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మారణకాండకు వ్యతిరేకంగా రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రజాస్వామిక వాదులు, ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు, రచయితల సంఘా లు కలిసి 'ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక' గా ఏర్పడి ఈనెల తొమ్మిది పది తేదీలలో హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించటం జరుగుతుం దన్నారు.ఈ సదస్సు ను విజయవంతం చేయాలని ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, విద్యార్థి, మేధావులకు, మహిళలకు విజ్ఞప్తి చేశారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం లో ప్రగతిశీల కార్మిక సమాఖ్య గుంటూరు నగర అధ్యక్షులు కర్రే యోహాను,కార్యదర్శి నన్నం పోతురాజు, షేక్ వలి,శ్రీను,డి ఆర్ ప్రసాద్,కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె కృష్ణ, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సి హెచ్ రాజశేఖర్, మరియు దేశ భక్త ప్రజాతంత్ర ఉద్యమం జిల్లా కన్వీనర్ దుగ్గిరాల సుధాకర్, బహుజన డెమోక్రటిక్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు సి హెచ్ డెన్నిస్ రాయ్ పాల్గొన్నారు.

## ఖరీఫ్ పంటలపై ఎస్సీ, ఎస్టీ రైతులకు అవగాహన సదస్సు



**కొరిశపాడు/కురిచేడు ఆగస్టు7(ఆంధ్రపత్రిక):** వర్ష కాలమునకు అనువైనటువంటి వివిధ రకాలైన ఉద్యాన పంటలలో బెండ, దోస, గోరుచిక్కుడు, మిరప,టమాట మొదలైన పంటలపై దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ గుంటూరు నాగమణి అధ్యక్షతన కురిచేడు మండలం అలవలపాడు గ్రామంలో ఎస్సీ ఎస్టీ రైతులకు వ్యవసాయ అభివృద్ధి పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం శివ మాట్లాడుతూ మిరప పంటలో ముఖ్యంగా ఉద్యాన పరిశోధన స్థానం లామ్ గుంటూరు నుండి విడుదలైనటువంటి LCA 684 మరియు 657, టమాటాలో అర్కా అబేద్, అర్క సామ్రాట్ ,అర్కా రక్షక్, బెండలో అర్క నికిత, పర్బని క్రాంతి, దోసలో RNF163 రకాలు సాగుకు అనుకూలంగా ఉంటాయని రైతులకు చెప్పడం జరిగింది. ఈ మేలు రకాల తో పాటుగా సమగ్ర యాజమాన్య పద్ధతులైన అనగా విత్తన శుద్ధి చేసుకోవడం, నారుమడులలో ట్రైకోడెర్మా సిలింద్రాలను పశువుల ఎరువులతో వేసుకో వడం ఎస్సీ, ఎస్టి రైతులకు అవగాహన కల్పించినారు. ఈ కార్యక్రమంలో గంగవరం రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు యోగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఎస్సీ కౌలు రైతు పంట సాగు ధ్రువీకరణ పత్రం పొందాలని, వేసిన పంటలలో తప్పనిసరిగా ఈ- క్రాఫ్ట్ నమోదు చేసుకోవాలని ఆయన రైతులకు తెలియజేశారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్పీ రైతులు వారు వేసే పంటలలో ఎక్కువ శాతం పురుగు మందులు వాడుతున్నందున, రైతాంగం అంతా కూడా ఎక్కువ పెట్టుబడి పెట్టడం వల్ల దిగుబడి తీసు కోకపోవడం వలన ఎంతో నష్టాలు పాలవుతున్నారని ఆయన తెలియజేశారు. అదేవిధంగా వ్యవ సా యంలో ఆధునిక మెలుకువలు అవలంబించి పెట్టుబడి తగ్గించుకొని దిగుబడి పెంచుకోవాలని రైతు లకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ రైతులు మరియు కౌలు రైతులు పాల్గొన్నారు.

## ఫ్యాషన్ డిజైనింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ, ఫ్యాబ్రిక్ ప్రింటింగ్ లపై శిక్షణ



**ఆగిరిపల్లి,ఆగస్టు 7(ఆంధ్రపత్రిక):** ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో గల హీల్ పాఠశాల ఆవరణలో పవర్ మేక్ వృత్తి విద్యా శిక్షణ కేంద్రంలో టెక్స్టైల్ ప్రింటింగ్ యూనిట్ ను విజ్ఞాన్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ యు జి సి మాజీ సెక్రటరీ ప్రొఫెసర్ కె రామ్మూర్తి నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతివృత్తులు, నైపుణ్య శిక్షణలు యువతీ యువకులకు జీవనోపాధి అవకాశాలు మెరుగుపడతాయని, వారిలో దాగివున్న సృజానాత్మకతను బహిర్గతం చేస్తాయని, దేశంలో యువతీ యువకులకు ఫ్యాషన్ డిజైనింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ, ఫ్యాబ్రిక్ ప్రింటింగ్ మొదలగు రంగాలపై ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు కోనేరు సత్య ప్రసాదు, కార్యదర్శి, సీఈవో కూరపాటి అజయ్ కుమార్, ప్రముఖ ఆర్ట్ సైంటిస్ట్ కె కృష్ణ మూర్తి, సైబర్ సెక్యూరిటీ కోర్స్ ఇన్చార్జి రాజి, కృపానిధి, బి సాయిబాబు, హరీష్ పాల్గొన్నారు.

# ఆ కుటుంబానికి దిక్కేది?

# కరెంటు షాక్‌తో యువకుడి మృతి

**ప్రముఖ హోటల్ రామయ్య మెస్ యజమాని ఇంటి వద్ద దుర్ఘటన- న్యాయం చేయాలని హోటల్ వద్ద మృతుడి బంధువులు స్నేహితులు ఆందోళన**





**మచిలీపట్నం ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** ఆ కుటుంబానికి మణి కంత ఆధారం మార్బుల్ పని అతని వృత్తి. స్థానిక 51 డివిజన్ కి చెందిన గంజాల మణికంత (21) రామయ్య మెస్ యజమాని ఇంట్లో మార్బుల్ పనులు నిర్వహిస్తున్నాడు. దురదృష్టవశాత్తు మణికంతకు కరెంట్ షాక్ కొట్టి చనిపోవడం జరిగింది. చనిపోయిన గంజాల మణికంతకు ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. ఆ కుటుంబానికి అతడే జీవనాధారం. మృతుడి బంధువులు మణికంత మృతికి ఏకధాటిగా రోదిస్తున్నారు. మృతుడి బంధువులు స్థానిక లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద ఉన్న రామయ్య మెస్, వద్ద ఆందోళన చేపట్టారు. బంధువులు అక్కడే బైఠాయించడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగింది. హోటల్ మూసి వేయడం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల నిరంతరం పహారా కాస్తున్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని హోటల్ వద్ద తీవ్ర ఆందోళన నిర్వహిస్తున్నారు. పరిస్థితులు ఎలా చక్కబడతాయో వేచి చూద్దాం?

# కొండపల్లి మున్సిపాలిటీలో పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలి

**ఎన్టీఆర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు బొర్రా కిరణ్ డిమాండ్**



**మైలవరం, ఆగస్టు 7: (ఆంధ్రపత్రిక):** కొండపల్లి మునిసిపాలిటీ ఎన్నికలలో ఆనాటి వైసీపీ ప్రభుత్వం ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా పాలవర్గాన్ని ఏర్పాటు కాకుండా, మునిసిపాలిటీ అభివృద్ధిని అడ్డుకోవటం దురదృష్టకరం అని ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ ఆరోపించారు. బుధవారం నా డు కొండపల్లిలోనే డిసిసి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కొండపల్లి మునిసిపాలిటీ ఎన్నికలు జరిగి 30 నెలలు పైగా అయినా ఇప్పటివరకు పాలకవర్గం లేని అనాథ మునిసిపాలిటీగా మిగిలి పోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొండపల్లి మునిసిపాలిటీ అయినందుకు సంతోషపడాల లేదా పాలకవర్గం లేనందుకు బాధ పడాలో అర్థం కానీ అయోమయ పరిస్థితులలో ఇక్కడి ప్రజలు ఉన్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ చొరవతో ఇబ్రహీంపట్నం, కొండపల్లి మేజర్ పంచాయతీలను కలిపి గ్రేడ్ - 3 మునిసిపాలిటీ గా ఏర్పాటు చేసారనీ, దీని పరిధిలో మొత్తం 29 వార్డులు వుండే విధంగా నిర్ణయించి, స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా పురపాలక సంఘం కౌన్సిల్ ఎన్నికలు 2021 నవంబరులో జరిగాయన్నారు. ఆనాడు మొత్తం 29 వార్డులకు జరిగిన ఎన్నికలలో 10వ వార్డు నుంచి గెలిచినా టీడీపీ రేబల్ స్వతంత్ర అభ్యర్థి మరియు గెలిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థు లు 14 వార్డులు తో కలిపి 15 వార్డుల తో మెజార్టీ తో నిలువగా, అలాగే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 14 వార్డులు గెలిసి పాలకవర్గ ఎన్నికలలో ఓడిపోవటం జరిగిందన్నారు. అనంతరం స్వతంత్ర అభ్యర్థి ఓటు, ఎక్స్ అఫీషియా ఓట్లుతో మున్సిపల్ ఛైర్మన్ గా తేదేపా అభ్యర్థి ఎన్నికయ్యారన్నారు. కానీ ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఈ ఎన్నిక చెల్లదు అని న్యాయస్థానం ని ఆశ్రయించి ప్రజలు ఇచ్చిన ప్రజా తీర్పు ను గౌరవించకుండా పాలవర్గంను ఏర్పాటు కాకుండా ఆపించటం చాల బాధాకరమని అని బొర్రా కిరణ్ అన్నారు. ఇప్పటికీ అయినా దీనిపై పూర్తి అవగాహన కలిగిన స్థానిక శాసన సభ్యులు దృష్టిపెట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పాలక వర్గం ఏర్పాటు అయ్యేందుకు, అలాగే అభివృద్ధి లో వెనుకపడుతున్న మునిసిపాలిటీ పై తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ద్వారా డిమాండ్ చేస్తున్నాం అని బొర్రా కిరణ్ అన్నారు. ఈ సమావేశం లో పీసీసీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాస్, చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్, అక్కల నాగేంద్ర ప్రసాద్, రాగాల రాము, చెరుకు ఆనందరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలి

## కాగిత కృష్ణ ప్రసాద్



**గూడూరు ,ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** గూడూరు మండలం, ఆర్.వి పల్లి గ్రామంలో విష జ్వరాలు వ్యాపిస్తుండడంతో గ్రామంలో నిర్వహించిన మెడికల్ క్యాంపు ను సందర్శించి , గ్రామం లో పర్యటించి వైద్య సిబ్బందికి, మరియు గ్రామపంచాయతీ కార్యదర్శి సూచనలు ఇస్తున్న పెడన నియోజవర్గ ఎంఎల్ఏ కాగిత కృష్ణ ప్రసాద్, ఈ సందర్భంగా కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు కారణంగా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే పంచాయతీ సిబ్బంది గ్రామంలో రోజు శానిటేషన్ నిర్వహించాలని, అలాగే వైద్య సిబ్బంది డాక్టర్స్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి, గోపి నాగబాబు, ఎన్ ఏ బేగ్, బొర్రా శ్రీను, పాలగాని సిద్దు, మట్ట శ్రీనివాసరావు, ఎమ్మార్వో రాజ్యలక్ష్మి, ఇఓపిఆర్డి రాజేశ్వరి, డాక్టర్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు .

# ప్రాథమిక పాఠశాలలను మూసివేయ్యాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసమహరించాలి



**నూజివీడు, ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** పదిమంది లోపు పిల్లలున్న ప్రాథమిక పాఠశాలలను మూసివేయడన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి,,,,,, ఏఐటీయూసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని. వెంకట రామారావు డిమాండ్, చేశారు. పదిమంది పిల్లలు ఉన్న స్కూళ్లను రద్దు చేస్తామని ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే ఉపసరించుకోవాలి అని బుధవారం స్థానిక నూజివీడు అమర్ భవన్ విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం మూడు నాలుగు ఐదు తరగతులను హై స్కూల్స్ లో విలీనం చేయటం వలన ప్రాథమిక పాఠశాలలో పిల్లలు తగ్గటం జరిగిందని,ఇప్పుడు పిల్లలు సరిపోను లేని కారణంతో ప్రాథమిక పాఠశాలలను ఎత్తి వేయడం జరిగిందని అన్నారు, ప్రాథమిక పాఠశాలలను రద్దు చేయడం ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ పిల్లలను ప్రాథమిక విద్యకు దూరం చేయడమే అని అన్నారు, గతంలో ఉన్నత పాఠశాలలో కలిపిన మూడు నాలుగు ఐదు తరగతులను మరలా తిరిగి ప్రాథమిక పాఠశాలలో కలిపి ప్రభుత్వ స్కూళ్లను తీసి వేయకుండా, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, దీనికి అనుగుణంగా జీవో 117 ను ప్రభుత్వం రద్దు చేయాలి అని కోరారు.

గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 117 విధానాల వల్ల 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాల ల్లో విలీనం చేయడం వల్ల సుమారు నాలుగువేల పాఠశాలలు మూతపడ్డాయి, ఇప్పుడు వచ్చిన కూటమి ప్రభుత్వం జీవో నెంబర్ 117ను వెంటనే రద్దు చేయాలి, ఈ స్కూల్స్ మూసి వేయడం వల్ల పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు, ఆయాలకు ఉపాధి పోతుందని, వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు,, ఈ కార్యక్రమంలోఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల. పుల్లారావు, ఎఐటియుసి నాయకులు శిఖ ఆకాష్ తదితరులు పాల్గొన్నారు,

# ధాన్యం డబ్బులకోసం ఆగస్టు 13న సబ్ కలెక్టర్ ఆఫీసు వద్ద అందోళన



**నూజివీడు, ఆగస్టు 7 ( ఆంధ్రపత్రిక ):** ధాన్యం వ్యాపారస్తులైన మల్లూరి చంద్రశేఖర్ మల్లూరి సురేష్ నుంచి ధాన్యం డబ్బులు వెంటనే ఇప్పించాలని కోరుతూ ఆగస్టు 13న నూజివీడు సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద జరుగుతున్న అందోళనలో పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో కొంతమంది ప్రతినిధి బృందం ధాన్యం వ్యారస్థుల చేతిలో మోసపోయిన రైతుల గ్రామాలను ముఖ్యంగా అన్నవరం, సోమవారం, దిగవల్లి, సూరేపల్లి తదితర గ్రామాలను పర్యటించింది. రైతులను పరామర్శించింది.ఈ సందర్భంగా రైతులు అనేక అంశాలు చెప్పారు. పర్యటన అనంతరం నూజివీడులోని అమర్ భవన్ నందు విలేకరుల సమావేశం నిర్వహించి రైతుల చెప్పిన అంశాలను ప్రతినిధి బృందం వివరించింది. నూజివీడు, ముసునూరు, చాట్రాయి తదితర మండాలాల్లో 12 గ్రామాలకు చెందిన రైతుల దగ్గర నుండి నూజివీడు మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన అన్నదమ్ములు మల్లూరి చంద్రశేఖర్, మల్లూరి సురేష్ అనే ధాన్యం వ్యాపారస్తులు కోట్లాది రూపాయల విలువైన ధాన్యం కోనుగోలు చేశారు.

2023-2024 సంవత్సరం ఖరీఫ్ పంటను నాటి రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయక పోవడంతో రైతులు ధాన్యం వ్యాపారస్తులకు అమ్ముకున్నారు. అప్పటినుండి నెలల తరబడి డబ్బులు కోసం వ్యాపారస్తుల ఇంటి చుట్టూ తిరిగిన డబ్బులు ఇవ్వక పోగా తిరుపతి వెళ్ళి వచ్చిన తరువాత డబ్బులు ఇస్తామని చెప్పి రాత్రికి రాత్రే కుటుంబ సభ్యులతో సహా అజ్ఞానాత వాసానికి వెళ్ళాడు.ఈ విషయా న్ని మే 25న నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ లో 65 మంది రైతుల లిఖితపూర్వకంగా రిపోర్టు చేశారు.ఐనా పోలీసులు పరారీ లో ఉన్న చంద్రశేఖర్ ను తీసుకు రావడానికి ఎటువంటి ప్రయత్నా లు చేయలేదు. దీంతో రైతులు తీవ్రమైన ఆందోళన చెందు తున్నారు. చంద్రశేఖర్ భాదీతు డైన ముల్లంగి వీరయ్య ఇటీవల కాలంలో గుండెపోటుతో మరణించాడు.సూరేపల్లి గ్రామానికి చెందిన ముల్లంగి వీరయ్యకు రూ.85వేలు రావాలి. ముల్లంగి వీరయ్య రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేసి పండించిన ధాన్యాన్ని చంద్రశేఖర్ కు అమ్మాడు.ఆయనకు ఇద్దరు ఆడ పిల్లలు.పెద్దమ్మాయికి పెళ్ళి కుదిరింది.డబ్బులు ఇవ్వమని అడిగితే ఇవ్వక పోవడంతో పెళ్లి ఆగి పోయింది.దినితో తీవ్రమైన మనస్థాపానికి గుర్రై గుండె పోటుతో మరణించాడు.దాంతో ఆ కుటుంబం వీధిని పడింది.

ఇలాంటి సంఘటనలు ప్రతి గ్రామంలో ఉన్నాయి. రైతుల పక్షాన నిలబడవలసిన పోలీస్ యంత్రాంగం మోసం చేసిన వ్యారస్థులకు అనుకూలంగా వ్యవహారించడం బాధాకరమని రైతులు వాపోతున్నారు.ఈ నేపథ్యంలో రైతులందరూ ఐక్యంగా ఆగస్టు 13వ తేదీన నిరసన తెలియజేసి నూజివీడు సబ్ కలెక్టర్ కి వినతిపత్రం ఇచ్చి తమకు న్యాయం చేయమని అడగాటానికి సిద్ధమవుతున్నారు.

ఈ కార్యక్రమంలో భాదీత రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య విజ్ఞప్తి చేశారు.ఈ ప్రతినిధి బృందంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాయకులు రాయంకుల లక్ష్మణరావు, సి హెచ్ పుల్లారావు గంగులు గిరీష్ బాబు, శిఖ ఆకాష్, ఒగ్గు. ముఖర్జీ కట్టెబోయిన ప్రసాద్,కొలుసు శ్రీనివాసు, మందపాటి నాగరాజు కొలుసు రాంబాబు తదితరులు ఉన్నారు

# చేనేత వస్త్రాలను ఆదరించడం అందరి బాధ్యత

**పశ్చిమ శాసనసభ్యులు సుజనా చౌదరి**



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 7, (ఆంధ్రపత్రిక):**చేనేత వస్త్రాలను ఆదరించి చేనేత కార్మికులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పశ్చిమ నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యరావుపేటలోని ఎన్టీఆర్ జిల్లా బిజెపి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి బుధవారం హాజరయ్యారు. తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సుజనా మాట్లాడుతూ చేనేత మగ్గాల పై ఆధారపడి అవస్థలు పడుతున్న చేనేత కార్మిక రంగాన్ని , కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఉద్యోగులు ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు విధిగా ధరించాలన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో నేతన్నల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని చేనేత కార్మికులను ఆదుకోవడం కోసం తెలుగుదేశం హయాంలో అమలు చేసిన పథకాలను తిరిగి అమలుచేసి చేనేతకు పూర్వ వైభవం తేవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. చేనేతను ధరిస్తూ తనను తాను చేనేత బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నేతన్నల కళ్ళలో సంతోషాన్ని చూడటానికి ప్రధాని నరేంద్ర మోదీ తగిన ప్రోత్సాహాన్ని, సబ్సిడీలను, బ్యాంకు రుణాలను,అందజేసి చేనేతకు చేయూతనిస్తున్నారని తెలిపారు. అనంతరం బిజెపి నాయకులతో కలిసి చేనేత వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుల్ మీరా, బిజెపి నాయకులు శ్రీనివాస్ రాజు ,షేక్ బాజీ, భోగవల్లి శ్రీధర్, బి.శివకుమార్ పట్నాయక్, అవ్వారు బుల్లబ్బాయి, మువ్వల వెంకటసుబ్బయ్య, కేఎస్ ఆర్ముగం, పైలా సోమినాయుడు, నరసరాజు, పోతిన బేసు కంటేశ్వరుడు, మహిళా మోర్చా అధ్యక్షురాలు యర్ర సునీత,ఎన్. ప్రభుకుమార్ పాల్గొన్నారు.

# నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

**టిడిపి నాయకులు ఎంఎస్ బేగ్‌కు స్థానిక ప్రజల వినతి**



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 7, (ఆంధ్రపత్రిక):** స్థానిక కొత్తపేట 51వ డివిజన్ నెహ్రూ బొమ్మ కూడలిలో ఉన్న డివైడర్ ట్రాఫిక్‌కి తీవ్ర ఇబ్బందికరంగా మారిందని లితెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్. ఎస్. బేగ్ దృష్టికి తీసుకొని రాగా స్థానిక కూటమి నాయకులతో కలిసి ఆ ప్రాంతాన్ని బేగ్ పరిశీలించారు. అనంతరం బేగ్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలోని ముఖ్య కూడళ్లలో నెహ్రూ బొమ్మ కూడలి కూడా ఉందని, ఇక్కడ ఎక్కువగా శ్రామిక కార్మిక వర్గం మరియు వ్యాపారం, విద్య సముదాయాలకు ప్రధాన కూడలిగా ఉందని అన్నారు. ప్రధానంగా గత ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన ఈ రోడ్డు నందు డివైడర్ ఏర్పాటు చేసారని, గణపతిరావు రోడ్ నుండి కె.టి. రోడ్ టర్నింగ్ తీసుకొనుటకు అక్కడ ఉన్న డివైడర్ వాహనదారులకు ఇబ్బందిగామారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని అన్నారు. ఆ డివైడర్ లోని కొంత భాగం ఏర్పాటుచేయవద్దని నాడు ప్రతిపక్ష హోదాలో ఉండి మేము చెప్పినా వినకుండా, ఆనాటి పాలకులు ఏర్పాటు చేసారని, ఇప్పుడు ప్రజలకు ఇబ్బందిగా మారిందని అన్నా రు. ఈ సమస్యను స్థానిక శాసనసభ్యులు యలమంచిలి సుజనా చౌదరి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తాం అని తెలిపారు. ఈ కార్యక్ర మంలో కూటమి నాయకులు పోతిన బేసికంతేశ్వరుడు, సారిపల్లి రాధాకృష్ణ, బెవర సాయి సుధాకర్, బూర కనకారావు, మక్కిన భాస్కర్, భోగవల్లి నాగబాబు, దుర్భసుల హుస్సేన్, తారిక్ అజీజ్, తుడుము అనిల్, గంటా రాజు, కొల్లి దుర్గారావు పాల్గొన్నారు.

# నెహ్రూ యువ కేంద్రం ద్వారా స్వాతంత్ర దినోత్సవ సంబరాలకు ఎంపిక అయిన అడ్డగర్ల వినీల



**మైలవరం, ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** నెహ్రూ కేంద్రం సంఘటన్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ తరపున కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఆగస్టు 15 ఢిల్లీలో జరగబోయే స్వాతంత్ర దినోత్సవ సంబ రాలకు ఎన్టీఆర్ జిల్లా లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల నుండి తృతీయ సంవత్సరం బీటెక్ ఈ.ఈ.ఈ చదువుతున్న విద్యార్థిని అడ్డగర్ల వినీల ను నెహ్రూ కేంద్రం విజయవాడ ఎన్టీఆర్ డిస్టిక్ నుండి ఎంపిక చేయడం జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ మొత్తంలో వివిద జిల్లాల నుండి కేవలం ఐదుగురు సభ్యులు మాత్రమే ఎంపిక అవడం అందులో అడ్డగర్ల వినీల ఒకరు. వినీల నెహ్రూ యువ కేంద్రం మరియు లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ద్వారా జరిగిన, మై భారత్ మరియు మేరీ మట్టి మేరీ దేశ్ లాంటి కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పా రావు, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.శివ హరి ప్రసాద్ మరియు వివిధ విభాగాధిపతులు అడ్డగర్ల వినీల ను అభినందించారు.

## వైసీపీ నుంచి టిడిపిలోకి ఇద్దరు కౌన్సిలర్లు

# మూడుకు పెరిగిన టిడిపి బలం



**పెడన ,ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** వైసీపీ నుంచి ఇద్దరు కౌన్సిలర్లు బుధవారం నాడు టిడిపిలో చేరారు. దీంతో టిడిపి బలం కౌన్సిల్లో ముగ్గురుకి పెరగగా కూటమి బలం నలుగురు అయ్యారు. జనసేన పార్టీకి ఇక్కడ ఒక కౌన్సిలర్ ఉన్నారు.రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వ విధానాలు పట్ల ఆకర్షితులై టీడీపీ లో భాగస్వాములు కావాలని నిర్ణయించుకున్నామని పార్టీ మారిన కౌన్సిలర్లు చెప్పారు. 1వ వార్డు కౌన్సిలర్ బళ్ల పద్మావతి 20వ వార్డు కౌన్సిలర్ కోసనం కరుణ కుమారి కొసనం సత్యనారాయణ బళ్ల సూర్యచంద్ర రావులుకు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ టిడిపిలోకి వీరిని ఆహ్వానించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు సమక్షంలో పై ఇరువురు కౌన్సిలర్లు తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలుపార్టీ లో చేరారు. ఈ సందర్భంగా కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పట్ల ఆకర్షితులై పార్టీలో చేరిన వారిని స్వాగతిస్తున్నామని అన్నారు.భవిష్యత్తులో కూటమి అభివృద్ధి బాటలో పాలు పంచుకుని ప్రజా సంక్షేమం ధ్యేయంగా పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారిపై లైంగిక దాడి చేసిన వ్యక్తికి కఠిన శిక్ష విధించాలి: బర్మా ఫణి బాబు



**నూజివీడు,ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** నూజివీడు మండలం పల్లెర్ల మూడి గ్రామంలో నాలుగు సంవత్సరాల చిన్నారిపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని నూజివీడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బర్మా ఫణి బాబు పోలీస్ శాఖను, ప్రభుత్వాన్ని కోరారు.

అసలు ఇలాంటి అగాయిత్యాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకు నేలా చట్టాన్ని తీసుకురా వాలని , అభం శుభం తెలియని చిన్నారిపై లైంగిక దాడి చేయడం అమానుషమని బర్మా ఫణి బాబు అన్నారు.

## తిరుమలలో ఘనంగా
# పురుశైవారి తోట ఉత్సవం



**తిరుమల, ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** శ్రీ ఆండాళ్ అమ్మవారి తిరువాడిపురం శాత్తుమొరను పురస్కరించుకుని బుధవారం తిరుమలలో పురుశైవారి తోట ఉత్సవం ఘనంగా జరిగింది. పురాణాల ప్రకారం పాండ్య దేశంలో విష్ణుభక్తుడైన శ్రీ విష్ణుచిత్తుడికి చెందిన తులసీవనంలో భూదేవి అంశగా ఆండాళ్(గోదాదేవి) అమ్మవారు ఆవిర్భవించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని టిటిడి ప్రతి ఏడాదీ తిరువాడిపురం శాత్తుమొర నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు పురుశైవారితోటకు వేంచేపు చేశారు. అక్కడ నివేదనల అనంతరం స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా తిరిగి బయల్దేరారు. మార్గమధ్యంలో పొగడ చెట్టుకు హారతి, పుష్పమాల, శఠారి సమర్పించారు. శఠారికి అభిషేకం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లు ఆలయ మాడ వీధుల గుండా ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి అలయ పెష్కర్ శ్రీ. శ్రీహరి, పారుపత్తేదార్ బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణరాజు, ఉపేంద్ర సేవలు విలువైనవి

### సెంట్రల్ జి.ఎస్.టి కమీషనర్ సాధు నరసింహారెడ్డి



**గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** ఉద్యోగులు ఎన్ని ప్రాంతాలు మారినా, వారు అందించిన సేవలు మాత్రం శాశ్వతంగా నిలిచిపోతాయని సెంట్రల్ జి.ఎస్.టి కమీషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. కన్నావారితోటలోని జి.ఎస్.టి భవన్ లో ఒకేసారి ఇద్దరు ఐ. ఆర్.ఎస్ ఉన్నతాధికారులు బదిలీ అయిన సందర్భంగా బుధవారం వారికి వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ బదిలీయైన అడిషనల్, జాయింట్ కమీషనర్లు జి.రామకృష్ణరాజు యాదవ్, ఊపేంద్రకుమార్ ధృవ్ నిబద్ధతతో పనిచేసారన్నారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచటానికి ఎంతో కృషి చేశారన్నారు. వారి సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. బదిలీయైన రామకృష్ణరాజు యాదవ్, ఊపేంద్రకుమార్ ధృవ్ మాట్లాడుతూ కమీషనర్ నరసింహారెడ్డి సారథ్యంలో తాము పనిచేయటం గొప్ప వరమన్నారు. కమీషనర్ సూచనలతోనే తాము ఉత్తమమైన ఫలితాలు ఇవ్వ గలిగామన్నారు. అనంతరం ఇద్దరు ఉన్నతాధికారులను కమీషనర్, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ ప్రశాంత్ కుమార్, జాయింట్ కమీషనర్ లక్ష్మినారాయణ, అసిస్టెంట్ కమీషనర్లు రవికుమార్, సీతారామరాజు సూపరింటెండెంట్ లు గాదె శ్రీనివాసరెడ్డి, యుగంధర్, మూర్తి, నవీన్, సురేష్, ఈశ్వర్, శాఖమూరి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతాం..

### – గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్



**గూడూరు, ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనుల వివరాలను అధికారులు వెంటనే తెలియజేయాలని త్వరలో పనులు ప్రారంభిస్తామని పలు సమస్యలపై వచ్చే ప్రజలకు సత్వరమే సమస్యలు పరిష్కారమయ్యేలా అధికారులు పనిచేయాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అధికారులను ఆదేశించారు.గూడూరు పట్టణంలోని మెప్మా కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే సునీల్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు .శాఖల వారీగా పెండింగ్లో ఉన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి నాయకులు తమ మండలాల్లో ఉన్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని వీటితో అత్యవసర పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సత్వరమే పనులు అధికారులు చేయాలని పలుమార్లు తిప్పుకోవద్దని సూచించారు .గత అయిదు సంవత్సరాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు లేవని అధికారులు ఈ ప్రభుత్వంలో అలా ఉండదని ఎప్పటికప్పుడు గ్రామాల్లో తిరుగుతూ సమస్యలు గుర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నాయకులు పులిమి శ్రీనివాసులు ,వెంకటేశ్వర రాజు ,సర్వోత్తమ్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,కిషోర్ నాయుడు,నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి .బిల్లు చెంచు రామయ్య ,లీలావతి, శ్రావణి,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ వేతన
# బకాయిలు తక్షణమే చెల్లించాలి



**అద్దంకి, ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలో ఉపాధి హామీ పనుల్లో చేసిన వ్యవసాయ కార్మికులకు గత మే నెల నుండి రాష్ట్ర వ్యాప్తం గా సుమారు 1000 కోట్లు బకాయిలు ఉన్నాయ ని వాటిని వెంటనే విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న బకాయిలు తక్షణమే విడుదల చేసి పేదలను ఆదుకోవాలని కోరుతూ పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి అసిస్టెంట్ కమిషనర్‌కి వినతి పత్రం సమర్పించడం జరిగిందని సిపిఎం బాపట్ల జిల్లా అధ్యక్షులు మోండ్రు ఆంజనేయులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు,రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు,ఉపాధ్యక్షులు కోట కళ్యాణ్ ఉన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జరిగిన
# చేనేత దినోత్సవ వేడుకలు

**బంటుమిల్లి, ఆగస్టు 7(ఆంధ్రపత్రిక):** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్ మోహన్ రావు అధ్యక్షతన ఈ వేడుకలు ఘనంగా జరిగాయి 1905 ఆగస్టు 7 స్వదేశ ఉద్యమంలో భాగంగా విదేశ వస్తువులు బహిష్కరణ స్వదేశ వస్తువుల వినియోగం ఖద్దరు ప్రాముఖ్యత గురించి ప్రిన్సిపాల్ జగన్మోహన్ రావు గారు విద్యార్థులకు వివరించారు వైస్ ప్రిన్సిపాల్ దేవ జయరాజు గారు మాట్లాడుతూ చేనేత కార్మికులను ప్రోత్సహించాలని చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చారు ఐ క్యూ ఏసి కోఆర్డినేటర్ ఆర్ హిమాలనీ దేవి మాట్లాడుతూ మన దగ్గరలో ఉన్న చేనేత వస్త్ర పరిశ్రమలకు నిలయాలైన పెడన కలంకారి రాయవరం మంగళగిరి చీరాల వంటి చేనేత వస్త్రాల గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు ఖద్దర్ వస్త్రాలు ధరించి అలరించారు ఈ కార్యక్రమం డిపార్ట్మెంట్ ఆఫ్



కామర్స్ ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి అధ్యాపకులు డాక్టర్ ఎస్ సత్య రాజేష్ జహీదా బేగం చలం ప్రసాద జోత్స్న సుజాత విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బంటుమిల్లి తహసీల్దార్‌గా భరత్ రెడ్డి

**బంటుమిల్లి, ఆగస్టు 7(ఆంధ్రపత్రిక):** బంటుమిల్లి మండల తహసీల్దార్‌గా తుని తహసీల్దార్ యిప్పటి వరకు పని చేసిన వి. వి భరత్ రెడ్డీ సాధారణ బదిలీల్లో భాగంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా బంటుమిల్లి డిప్యుటీ తహసీల్దార్ కట్టా రామ్ శివ, సీనియర్ అసిస్టెంట్ శంకర్, రెవిన్యూ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అలాగే పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు వక్కపాటి శివ ప్రసాద్, గొల్లప్రోలు రామాంజనేయులు, దాసరి జోజి బాబు, శివ రామకృష్ణ, ఏనుముల కొండా,దునపూడి రాంప్రసాద్, భరత్ రెడ్డీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.ఓ లు గంగాజాలం, వేణు, చింతయ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తహసీల్దార్ భరత్ రెడ్డీ గతంలో 2019 కీ ముందు కృత్తివెన్ను మండలంలో కూడా విధులు నిర్వహించి సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు, అందువల్లనే అయన బంటుమిల్లి మండల తహసీల్దార్‌గా వస్తున్నారు అని తెలియడంతో రెండు మండలాల్లోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## మున్సిపాలిటీలో ప్రజా సమస్యలపై
# స్పెషల్ డ్రైవ్..

**-ఆటోనగర్, డ్రైవర్ కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తాం..**
**-ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి,టిడిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, అధికారులు..**



**హిందూపురం, ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు బుధవారం నియోజకవర్గ సమన్వయకర్త కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు డి.ఈ రమేష్ కుమార్, మాజీ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకటస్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ కుమార్ తో పాటు మున్సిపల్ అధికారులు, రెవెన్యూ, ట్రాన్స్కో అధికారులతో కలిసి మునిసిపల్ పరిధిలోని డ్రైవర్స్ కాలనీలో పర్యటించారు. ప్రజలు అనేక సమస్యలు వారి దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారంలో భాగంగా అనేక నివాసాలకు ఆస్తి పన్ను విధించని వారందరికీ వెసలుబాటు కల్పిస్తూ అక్కడికక్కడే దరఖాస్తులు తీసుకొని ఆస్తి పన్ను విధిస్తామని చెప్పడం జరిగింది. అలాగే కాలనీలో రహదారులను మరి కాలువల నిర్మాణాలు చేపడతామని మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ నేతృత్వంలో మినీ మోటార్స్, డ్రైవర్స్ అందరికీ స్థలాలకు కేటాయించి పట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే హౌసింగ్ వారితో మాట్లాడి ఇళ్ల నిర్మాణానికి రుణాల మంజూరు చేయించారు. కాలనీకి విద్యుత్ స్తంభాలు, దీపాలు ఏర్పాటు చేశారని అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఐదు సంవత్సరాల కాలంలో డ్రైవర్స్ కాలనీని పట్టించుకోలేదన్నారు.అనేక సమస్యలతో బాధపడుతూ వారు శాసనసభ్యులు వారి కార్యాలయం వచ్చి వినతిని సమర్పించారు. ఈ నేపథ్యంలో డ్రైవర్స్ కాలనీ వారందరికీ న్యాయం చేసే విధంగా పర్యటించి అంశాలవారీగా సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్ శివారెడ్డి, ట్రాన్స్కో డి ఇ బాలసుబ్రమణ్యం, టిడిపి నాయకులు వెంకటస్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు సతీష్, నాగేంద్ర, ఇతర అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్త్రీనిధి రుణాల డాకుమెంట్స్ పరిశీలంచిన
## మేనేజర్, పేటియం ద్వారా మాత్రమే చెల్లింపులు జరపాలి



**జె. పంగులూరు, ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** మండలంలోని కస్యాపురం చందలూరు నూజెల్లపల్లి గ్రామాలలోని స్వయం సహాయక సంఘాల స్త్రీనిధి రుణాల అప్లికేషన్ వెరిఫికేషన్ లను పరిశీలించిన మేనేజర్ టెక్కెం శ్రీనివాసరావు ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఋణం తీసుకున్న ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు వారి ఋణ కంతులను క్లస్టర్ కి కేటాయించిన పేటీఎం మెషిన్ ద్వారా మాత్రమే చెల్లింపులు జరపాలని తెలిపారు.. సక్రమంగా చెల్లించిన సభ్యులకు 11.25% శాతం వడ్డీ మాత్రమే పడుతుందని .రుణం పొందిన సభ్యురాలు ఋణ కంతులు చెల్లిస్తూ మూడునెలలు తరువాత అకస్మాత్తుగా మరణించినట్లయితే అప్పటివరకు ఉన్న రుణం మొత్తం స్త్రీనిధి ఇన్సూరెన్స్ ద్వారా రద్దు అవుతుందని తెలిపారు. ప్రతి నెల ఒకటో తారీకు నుంచి ఐదో తారీకు లోపు పేటియం మిషన్ ద్వారా చెల్లింపులు జరపాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్యులు ఇచ్చారని తెలిపారు. రుణం పొందిన సభ్యులు జీవనోపాధి కొరకు రుణాలు వినియోగించుకొని ఆస్తులు సమకూర్చుకొని లాభం పొందాలని శ్రీనివాసరావు తెలిపారు ఈ కార్యక్రమంలో సీసీ ఎమ్ డి దాస్, సిహెచ్ సాల్మన్, విఓఏలు రత్నకుమారి, రేణుక, ఓబీ లు శైలజ అకౌంటెంట్ భాస్కరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పంగిడేశ్వరరావు కుటుంబ సభ్యులను
# ఓదార్చిన మంత్రి సారథి



**ఆగిరిపల్లి, ఆగస్టు 7 ఆంధ్రపత్రిక :** ఆగిరిపల్లి మండలం చొప్పర మెట్ల గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు (ఇటీవలి గుండె పోటు తో మరణించిన) కూరాకుల పంగిడేశ్వరరావు చిత్ర పటానికి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా సారధి మాట్లాడుతూ పంగిడేశ్వర రావు ఎంతో విలువలు కలిగి వ్యక్తి అని చెబుతూ తెలుగు దేశం పార్టీ మీ కుటుంబానికి అండగా ఉంటుందని తెలి యజేశారు. ఈ కార్యక్రమములో శ్రీనివాస గౌడ్, పామర్తి నరసింహారావు, కాజా కిశోర్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 4000 సభ్యత్వాలు అవ్వటానికి కృషిచేసిన క్రియ వాలంటీర్లకు,
# జనసైనికులు అందరికీ అభినందనలు

**నూజివీడు, ఆగుష్టు 7, (ఆంధ్రపత్రిక):** జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వీర మహిళలు జనసైనికులు అందరికీ కూడా ప్రతి క్షణం పార్టీ అండగా ఉంటమదని జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు. శివరామకృష్ణ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జనసేనపార్టీ నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వం నమోదు మహాయజ్ఞంలో నూజివీడు నియోజక వర్గంలో 4000 క్రియాశీలక సభ్యత్వాలు నమోదు అవ్వడానికి కీలకపాత్ర పోషించి, శక్తి వంచన లేకుండా కృషి చేసి, విజయవంతం చేసిన క్రియా వాలంటీర్లు అందరికీ ఈ సందర్భంగా పేరు,పేరున హృదయపూర్వక అభినందనలు తెలిపారు.నియోజకవర్గంలో వాలంటీర్లకు సహకరించిన నాయకులకు, క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందన్నారు.

# బంటుమిల్లిలో తల్లిపాల వారోత్సవాలు



**బంటుమిల్లి, ఆగస్టు 7(ఆంధ్రపత్రిక):** స్థానిక సి డి పి ఓ ఆఫీస్ వద్ద బుధవారం నాడు తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి ఎండిఓ రామకృష్ణంరాజు మరియు మెడికల్ ఆఫీసర్, సిహెచ్ సౌందర్య, ఎంఈఓ బాలా త్రిపుర సుందరి దేవి, జనసేన బంటుమిల్లి మండల అధ్యక్షుడు ర్యాలీ సత్యనారాయణ,హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, అంగన్వాడి సూపర్వైజర్స్ అంగన్వాడీ టీచర్స్ మరియు మహిళా పోలీసులు తదితరులతో సిడిపిఓ సముద్రవేణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన భక్తులు తల్లిపాల విశిష్టత గురించి, తల్లి పాలు బిడ్డకు అమృత తుల్యమైనవని, బిడ్డకు తల్లి పాలివ్వడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించడం జరిగింది.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సిమెంట్ బల్లలు ఏర్పాటు



**అద్దంకి, ఆగస్టు7(ఆంధ్రపత్రిక):** రోటరీ క్లబ్ ఆఫ్ సింగర కొండ ఆధ్వర్యంలో నర్రా శ్రీలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా వేలమూరిపాడు రోడ్‌లోని వినాయకుని గుడి వద్ద నాలుగు సిమెంట్ బల్లలు ఆర్చి వద్ద ఒక బల్లవేలమూరిపాడు సమీపంలో రెండు బల్లలు మొత్తం ఆరు సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ శ్రీలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా గుడి దగ్గర భక్తులకు పాదచారులకుపయోగపడే విధంగా బల్లలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందిచదగ్గ విషయమని శ్రీలక్ష్మిని అభినందించారు. ఇతర సభ్యులు శ్రీలక్ష్మికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో ట్రెజరర్ మాలాది శ్రీనివాసరావు షేక్ మహమ్మద్ రఫీ డాక్టర్ ఉబ్బా దేవపాలన విద్వాన్ చంద్రమౌళి వెంకటేశ్వర్లు హరిప్రసాద్ లక్ష్మీనారాయణ సందిరెడ్డి శ్రీనివాసరావు రామకోటేశ్వరరావు అంజాద్ బాషా శ్రీనివాసరావు,గురు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పిటిషన్‌పై విచారణ..

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఆయనకు ఇస్తామంది. జగన్ భద్రతా సిబ్బంది సమాచారం ఇస్తే జామర్ ఇస్తామని స్పష్టం చేసింది. దీనిపై కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.

# త్వరలో 'అన్న' క్యాంటీన్లు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి వీటిని ప్రారంభించనున్నారు. తొలి విడతలో 100 చోట్ల క్యాంటీన్లు పెట్టనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రెండో విడతలో 83. మూడో విడతలో 20 అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని తెలిపింది. మొత్తం 203 క్యాంటీన్లకు హరేకృష్ణ ఫౌండేషన్ ఆహారం సరఫరా చేయనుంది.

# విచారణను వేగవంతం చేయండి

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో స్థానిక పోలీసులు హంతకులకు అండగా నిలిచారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ సమ యంలో కేసును నీరుగార్చేలా వ్యవహరించారని పేర్కొన్నారు. సీబీఐ అధికారులపై తప్పుడు కేసుతో పాటు సాక్షులను బెదిరించారని సునీత హోంమంత్రికి వివరించారు.ఈ కేసు సీబీఐ విచారణలో ఉన్నందున ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుందని మంత్రి అనిత తెలిపారు. దోషులకు శిక్ష పడేలా చూసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. తప్పు చేసిన పోలీసులను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

# సీబీఐపై సుప్రీం అసహనం

(మొదటిపేజీ తరువాయి)

సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులను తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీతో పాటు జగన్ బెయిల్ రద్దు చేసి విచారణ వేగవంతం చేయాలంటూ రఘురామ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి సీబీఐపై అసహనం వ్యక్తం చేసింది. మే 2న సీబీఐ దాఖలు చేసిన అఫిడవిట్లో పేర్కొన్న అంశాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని జస్టిస్ . సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ఆరుగురు జడ్జిలు మారిపోవడం, రిటైర్ కావడం జరిగిందని రఘురామ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలు తప్పంటూ కాలయాపన చేస్తున్నారని జస్టిస్ సంజీవ్ ఖన్నా అసహనం వ్యక్తం చేశారు. దీనికి, ట్రయల్‌కు సంబంధం లేదని వ్యాఖ్యానించారు. డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారని.. ట్రయల్ ముందుకు సాగకుండా ఇది అడ్డంకిగా మారుతోందని సుప్రీంకోర్టుకు సీబీఐ తెలిపింది. సుప్రీంకోర్టులో తాము కూడా అనేక పిటిషన్లు విచారించి డిశ్చార్జ్ చేస్తున్నామని.. తమకు ఎలాంటి అడ్డంకి రావడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. సీబీఐ తరపున వాదనలు వినిపించేందుకు అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎ) రాజు అందుబాటులో లేరని ఇతర న్యాయవాదులు న్యాయమూర్తికి తెలిపారు. అనంతరం ఈ కేసును నవంబర్ 11కు వాయిదా పడింది. ఇలాంటి కేసుల విచారణలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ట్రయల్ చేపట్టాలని సూచించారు. ఇప్పటికే మార్గదర్శకాలు ఉన్నందున వాటిని అనుసరించాల్సిందేనని జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టంచేశారు. అవే సీబీఐకి కూడా వర్తిస్తాయని తెలిపారు.

# చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటా..!

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చేనేత రంగానికి జీవం పాయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. చేనేత వస్త్రాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటానని గతం లోనే చెప్పానని, చెప్పినట్లే చేనేత వస్త్రాలు ధరిస్తున్నానని వెల్లడించారు. యువత, ఉద్యోగులు కూడా చేనేత వస్త్రాలు ధరించాలని సూచించారు. నేతన్నలు, చేనేత పరిశ్రమకు మా ప్రభుత్వం భరోసా ఇస్తుందని వివరిం చారు. చేనేత శాఖల్లో సంస్కరణలు తీసుకొచ్చి ఆదుకుంటామని పేర్కొన్నారు. ఏపీలో చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేవరకు అండగా ఉంటామని అన్నారు. వారంలో ఒక్కరోజైనా ప్రజలు చేనేత వస్త్రాలు ధరిం చాలని పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. ఏపీలో ఉప్పాడ, మంగళగిరి, చీరాల, పెడన, పొందూరు, ఎమ్మిగనూరు, వెంకటగిరి... చేనేత వస్త్రాలకు ప్రతీకలుగా ఉన్నాయని తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన చేనేత కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత వస్త్రాలు అనే మాట ప్రజల్లో ఒక భావోద్వేగాన్ని నింపింది. అలాంటి చేనేత రంగానికి జీవంపోయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. రాష్ట్రంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం కచ్చితంగా చేనేత పరిశ్రమకు, ఈ రంగంపై ఆధారపడ్డ నేతన్నలకు భరోసా ఇస్తుంది. అదే విధంగా ప్రజలు సైతం ఈ రంగానికి ప్రోత్సాహ మివ్వాల్సిన అవసరం ఉంది. కొన్నేళ్ల కిందట నేను చేనేత వస్త్రాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను అని చెప్పాను. ఆ క్రమంలోనే నేత వస్త్రాలను ధరిస్తున్నాను. అదే విధంగా యువత, ఉద్యోగులు వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరిస్తే ఈ రంగంపై ఆధారపడ్డవారికి ధీమా కలుగుతుందని అన్నారు.

# ప్రధాని మోదీకి అరుదైన కానుక

(మొదటిపేజీ తరువాయి)

దంపతులతో ప్రత్యేకంగా నేయించారు. ఈ కానుకను ప్రధానికి స్వ యంగా అందజేశారు. ఎంపీ అప్పలనాయుడు సూచన మేరకు ఈ చిత్రాన్ని విజయనగరం లోక్‌సభ నియో జకవర్గ పరిధిలోని ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం లావేరు మండలానికి చెందిన బాసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులు జూన్ మొదటి వారం నుంచి 40 రోజుల పాటు శ్రమించి పూర్తి చేశారు. మూడు అడుగుల వెడల్పు, ఆరు అడుగుల పొడవు కలిగిన చేనేత వస్త్రంపై మోదీ చిత్రాన్ని తీర్చిదిద్దారు.బుధవారం స్వయంగా ఎంపీ అప్పలనాయుడు మోదీకి ఈ చిత్రపటాన్ని అందజేయగా.. ఆయన చాలా సంతోషం వ్యక్తం చేశారు. చాలా చాలా ధన్యవాదాలు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం రోజున ఈ కానుక అందుకోవడం ఓ తీయని జ్ఞాపకంగా భావిస్తున్నట్లు మోదీ తెలిపారు. 40 రోజులపాటు శ్రమించి చేనేత వస్త్రంపై రూపొందించిన బాసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులను ప్రధాని అభినందించారని అప్పలనాయుడు తెలిపారు. అంతేకాకుండా పీవీజీ రాజు జీవిత చరిత్ర పుస్తకాన్ని కూడా మోదీకి అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు గురించి మోదీ అడిగారని తెలిపారు. అశోక్ గజపతిరాజు ఎలా ఉన్నారు? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది? అని వాకబు చేశారన్నారు. పీవీజీ రాజు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఇవ్వగానే నాలుగైదు పేజీలు తిరగేశారని.. ఆయన ఫొటోలను మోదీ పరిశీలనగా చూశారన్నారు. గుడ్.. గుడ్.. అని ప్రశంసించారని అప్పలనాయుడు తెలిపారు. పీవీజీ రాజు ఒక సామాజిక చైతన్యవేత్త అని ప్రధాని కొనియాడారన్నారు.

# ట్రంప్ హత్యకు భారీ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

రాజా మెర్చంట్‌ను అదుపులోకి తీసుకు న్నారు. అతనిపై అభియోగాలు నమోదు అయినట్లు అమెరికా అటార్నీ జనరల్ మెర్రిక్ గార్లాండ్ తెలిపారు. జనరల్ ఖాసిమ్ సోలేమాని హత్య తర్వాత అమెరికా ప్రభుత్వాధికారులపై ఇరాన్ టార్గెట్ చేసినట్లు తెలుస్తోందన్నారు . పాకిస్థాన్ జాతీయుడైన అసిఫ్ రాజా.. కిరాయి హత్యలకు పాల్పడేందుకు సిద్ధమైనట్లు ఎఫ్‌బీఐ చీఫ్ క్రిస్టోఫర్ వ్రే తెలిపారు.అసిఫ్ రాజాకు ఇద్దరు భార్యలు ఉన్నారు. ఒకరు పాకిస్థాన్‌లో, మరొకరు ఇరాన్‌లో ఉన్నారు. రెండు దేశాల్లోనూ అతనికి పిల్లలు కూడా ఉన్నారు. అసిఫ్ వేసిన ప్రణా ళికలు స్పై థ్రిల్లర్‌ను తలపిస్తున్నట్లు కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. డాక్యుమెంట్లను దొంగలి ంచడం, యూఎస్బీ డ్రైవర్లను చోరీ చేయడం, నిరసనలు చేపట్టడం, ప్రభుత్వ అధికారులను చంపడం లాంటి ప్లాన్ వేశారు.

# సిఎం దృష్టికి రియల్ ఎస్టేట్ రంగ సమస్యలు

**సిసోడియాను కలిసిన నారెడ్కో ప్రతినిధి బృందం**



**అమరావతి,ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** రెవిన్యూ విభాగానికి సంబంధించి రియల్ ఎస్టేట్ రంగం ఎదు ర్కుంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని రాష్ట్ర రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా తెలిపారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డవలప్ మెంట్ కౌన్సిల్ (నెరెడ్కో) ప్రతినిధుల బృందం బుధవారం సచివాలయంలో సిసోడియాను కలిసి రియల్ ఎస్టేట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వివరించింది. నారెడ్కో బృందంలో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధరరావు, సెక్రటరీ జనరల్ సీతారామయ్య, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ, రాష్ట్ర కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కిరణ్ పరుచూరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడె జగన్ తదితరులు ఉన్నారు. ఉన్నారు. ప్రధానంగా నెరెడ్కో ప్రతినిధులు గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ల్యాండ్ పార్శిల్ మ్యాప్ విధానాన్ని రద్దు చేయాలని, నాలా (నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్‌మెంట్) పన్ను తగ్గించాలని కోరారు. ఉమ్మడి అభివృద్ధి ఒప్పందం (జెడిఎ) కోసం రిజిస్ట్రేషన్ ఛార్జీలు మినహాయింపుతో డెవలప ర్లపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని, మరిన్ని జాయింట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను ప్రోత్సహించేలా నిబంధనలు రూపొందించాలని కోరారు. వ్యవసాయ భూమిని రెసిడెన్షియల్ ల్యాండ్‌గా మార్చే సమయంలో పట్టణ ప్రాంతంలో స్క్వేర్ యార్డ్ రేట్ల ఆధారంగా మార్పిడి ఛార్జీలను విధిస్తోందని, దానికి బదులుగా ఎకరాలలో లెక్కించాలని నెరెడ్కో విన్నవించింది. విభిన్న సమస్యలను సానుకూలంగా పరిశీలించిన సిసోడియా అన్ని విషయాలను ముఖ్యమంత్రి దృష్టి తీసుకువెళతామని , ప్రభుత్వానికి అదాయం సమకూరేందుకు కూడా రియల్టర్లు సహకరించాలని కోరారు.

# చేనేతల పక్షపాతి చంద్రబాబు

- రానున్నది చేనేత కార్మికుల స్వర్ణయుగమే
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు
- మేరీస్ స్టెల్లా నుండి బెంజ్ సర్కిల్ వరకు ఉత్సాహంగా చేనేత ప్రేమికుల నడక
- రాష్ట్ర చేనేత, జౌళి బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత




**విజయవాడ, ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలో చేనేతకు పూర్వ వైభవం తెచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర చేనేత, జౌళిబీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో నగరంలోని మేరీస్ స్టెల్లా కాలేజీ నుండి బెంజ్ సర్కిల్ వరకు చేనేత నడక ను నిర్వహించారు. మంత్రి సవిత జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ పోగును వస్త్రంగా తయారుచేసి మనిషి మానాన్ని కాపాడుతున్న చేనేత కార్మికులు అభినందనీయిలన్నారు. కూటమి ప్రభుత్వ హయాం చేనేతకు స్వర్ణయుగమన్నారు. చేనేత కార్మికుల కష్టాలపై ముఖ్యమంత్రికి పూర్తి అవగాహన ఉందని, వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. చేనేత కార్మికుల పక్షపాతిగా వారి సుస్థిర జీవనోపాధికి వివిధ సంక్షేమ పథకాలు అమలుచేశారన్నారు. గత కొన్నేళ్లలో నేతన్నలకు సరైన ఆదాయం లేక, వారి ఉత్పత్తులు కొనేవారు లేక వలసపోయే పరిస్థితి వచ్చిందని.. ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయన్నారు. నేతన్నలను ప్రోత్సహించే క్రమంలో ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని ఈ సందర్భంగా మంత్రి సవిత పిలుపునిచ్చారు.విశిష్టమైన చేనేత కళపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు చేస్తున్న కృషిలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామమోహన్ అన్నారు. చేనేత ఔన్నత్యాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించాలని కోరారు.విదేశీ వస్త్రాలను బహిష్కరించాలన్న లక్ష్యంతో స్వదేశీ ఉద్యమం వచ్చిందని.. 1905, ఆగస్టు 7న విదేశీ వస్త్రాలను బహిష్కరించడంతోపాటూ దేశీయోత్పత్తుల పునరుద్ధరణకు పిలుపు నిచ్చిన చారిత్రక ఘటనకు గుర్తింపుగా గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ 2015లో ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని వివరించారు. అగ్గిపెట్టలో సైతం ఇమిడిపోయే చీరను తయారు



చేసిన అద్భుత నైపుణ్యం మన నేతన్నల సొంతమని శాసనసభ్యులు రామమోహన్ అన్నారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత కీలకభూమిక పోషించిందన్నారు. నేటి యువతను ఆకర్షించేలా చేనేత ఉత్పత్తులకు నూతనత్వాన్ని ఆపాదిస్తున్నామన్నారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ జి.రేఖారాణి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు గుర్తుగా నిలిచే చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. ఆప్కో ఎండీ ఆర్.పవనమూర్తి మాట్లాడుతూ విభిన్న రాష్ట్రాల చేనేత ఉత్పత్తులతో పంటకాలువ రోడ్డులోని మేరిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో బుధవారం నుండి నిర్వహిస్తున్న చేనేత ప్రదర్శన, విక్రయాలను ప్రోత్సహించాలన్నారు. ఆర్కియాలజీ, మ్యూజియమ్స్ కమిషనర్ జి.వాణీ మోహన్ తదితరులు చేనేత నడకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చేనేత వస్త్రాలు ధరిద్దాం.. చేనేత కళను ప్రోత్సహిద్దా మంటూ చేనేత ప్రేమికులు చేసిన నినాదాలలో బెంజిసర్కిల్ లో సందడి వాతావరణ నెలకొంది. ఎస్ఆర్ఆర్-సీవీఆర్ కళాశాల, ఎస్ సి సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏకరూప చేనేత వస్త్రాలను ధరించి చేనేత నడకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చేనేత జౌళి శాక సంయిక్త సంచాలకులు కన్నబాబు, ఎం.నాగేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా చేనేత, జౌళి అధికారి ఎస్.రఘునందన్, స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ, ఎస్ఆర్ఆర్-సీవీఆర్ కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# త్వరలో రెవెన్యూ సదస్సులు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తామన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన మద్యాన్ని అందిస్తామని తెలిపారు. జగన్ బొమ్మ, పేరు ఉన్న సర్వేరాళ్లను ఏం చేయాలనే అంశంపై చర్చించినట్లు తెలిపారు. దేశంలో ఫెర్టిలిటీ రేటు తగ్గుతోందని.. ఏపీలోనూ సంతానోత్పత్తి రేటు తగ్గుదల అంశంపై చర్చ జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం ముగిసింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. మంత్రివర్గం సమావేశం ముగిసిన అనంతరం మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను ఆయన వెల్లడించారు. స్థానిక ఎన్నికల్లో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే అనర్హత వేటు నిబంధన ఎత్తివేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నిబంధన ఎత్తివేసేలా చట్ట సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేరు తొలగించాలని పలువురు మంత్రులు సూచించారన్నారు. బొమ్మల పిచ్చితో నాటి సీఎం రూ.700 కోట్లు వాడేశారని మంత్రులు అన్నారని తెలిపారు. మావోయిస్టులపై మరో ఏడాది నిషేధం విధించేలా క్యాబినెట్ తీర్మానం చేసింది. వైకాపా ప్రభుత్వం, గతంలో తెదేపా హయాంలో చేపట్టిన మద్యం విధానాలపై చర్చ జరిగింది. ఎక్సైజ్ విధానంలో అక్రమాలకు తావులేకుండా మార్పులు, చేర్పులపైనా చర్చించారు. అక్టోబర్ నుంచి కొత్త మద్య విధానం అమల్లోకి రానుందని అన్నారు. మత్స్యకారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్న 217 జీవోను రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయించిం దని పార్థసారథి తెలిపారు. సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేరు తొలగించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజముద్ర ఉన్న కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి నిర్ణయం తీసుకుంది. జగన్ బొమ్మలతో ఉన్న పాస్ పుస్తకాలను వెనక్కి తీసుకోనుంది. రీ సర్వేపై క్యాబినెట్‌లో రెవెన్యూశాఖ నోట్ సమర్పించింది. దీనివల్ల తలెత్తిన వివాదాలపైనా చర్చ జరిగింది. గత ప్రభుత్వ విధానం వల్ల రీ-సర్వేపై ఆందోళన ఉందని మంత్రులు తెలిపారు. భూయజమానుల్లో ఆందోళనతో గ్రామాల్లో వివాదాలు పెరుగుతాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. రీ- సర్వే పక్రియను పక్కన పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. గ్రామాలవారీగా రెవెన్యూ సదస్సులు నిరర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# వినేశ్ ఫొగట్‌పై అనర్హత



(మొదటిపేజీ తరువాయి)

ఇవాళ రాత్రిఫైనల్‌లో వినేశ్ తలపడాల్సి ఉంది. ఈ క్రమంలో ఆమె బరువును చూసిన నిర్వాహకులు 100 గ్రాములు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో వినేశ్‌పై అనర్హత వేటు వేస్తూ ఒలింపిక్ కమిటీ, రెజ్లింగ్ కమిటీ నిర్ణయం తీసు కున్నాయి. ఫైనల్ పోరులో పసిడి పతకం సాధిస్తుందన్న ఆశల వేళ ఈ వార్త కోట్లాది మంది భారతీయుల హృదయాలను ముక్కలు చేసింది. ఈ క్రమంలోనే అనర్హతపై ప్రధాని మోదీ స్పందిస్తూ వినేశ్‌ను ఓదార్చారు. వినేశ్.. నువ్వు ఛాంపియన్లకే ఛాంపియన్! నీ ప్రతిభ దేశానికి గర్వకారణం. భారతీయులందరికీ నువ్వు స్ఫూర్తిదాయకం. ఈ రోజు నీకు తగిలిన ఎదురుదెబ్బ ఎంతో బాధించింది. దీన్ని వ్యక్తం చేయడానికి నా దగ్గర మాటల్లేవు. కానీ,ఈ బాధ నుంచి బయటపడి నువ్వు బలంగా తిరిగి రాగలవని నేను నమ్ముతున్నా. సవాళ్లను ఎదిరించడం నీ నైజం. నీకు మేమంతా అండగా ఉన్నాం అని మోదీ భరోసానిచ్చారు. తాజా పరిణామాల వేళ భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. వినేశ్‌పై అనర్హతకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీసిన ప్రధాని.. దీన్ని సవాల్ చేసేందుకు భారత్‌కు ఉన్న అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వినేశ్‌కు ఉపయోగపడుతుందనుకుంటే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ వద్ద పీటీ ఉషకు సూచించినట్లు సమాచారం.

# బంగ్లాలో ఆగని హింసాకాండ

**ఢాకా,ఆగస్టు 7 :** బంగ్లాదేశ్‌లో జరిగిన హింసాకాండలో ఇప్పటికే వందల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకా కోల్పోతు న్నారు. ఆందోళన కారులు హసీనా అనుచరులను, అక్కడి హిందువులను లక్ష్యంగా చేసుకుని ఊచకోతకు దిగుతున్నారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం ఈ విషయంలో ప్రముఖ ఆధ్యాత్మకవేత్త జగ్గీవాసుదేవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాజీ ప్రధాని షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్ నేతలకు మృత్యుపాశమైంది. ఆ నేతలను ఆందోళనకారులు వెంటాడి, వేటాడి ఊచకోత కోశారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆ అవామీ లీగ్ నేతల మృతదేహాలు లభ్యమవుతుండటమే అందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. బంగ్లాదేశ్ వ్యాప్తంగా 29 మంది మృతదేహాలను గుర్తించారు. అందులో 20 అవామీ లీగ్ నేతలవేనని మీడియా వెల్లడించింది. సాత్ఖిరా ప్రాంతంలో 10 మంది, కొమిల్లాలో 11 మంది దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. అశోక్తలాలో ఒక మూక మాజీ కౌన్సిలర్ ఎండీ షా ఆలం ఇంటికి నిప్పు పెట్టిందని ఒక ప్రత్యక్ష సాక్షి వెల్లడించారు. దాంట్లో ఐదుగురు టీనేజర్లతో పాటు మొత్తం ఆరుగురు సజీవ దహనమయ్యారు. నటోరె ప్రాంతంలో ఒక ఎంపీ ఇంటికి నిప్పుపెట్టారు. ఆ ఇంట్లోని పలు గదులు, బాల్కనీలు, పైభాగంలో తాజాగా మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆదివారం నుంచి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఆందోళన కారులు అవామీ లీగ్‌తో సంబంధాలు ఉన్నవారిపై విరుచుకుపడ్డారు. వెంటాడి మరీ వారిని ఊచకోత కోశారు. సోమవారం కూడా ఈ హింసా కాండ కొనసాగింది. షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేశారని తెలియగానే.. ఆమె మద్దతుదారులపై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో యువ నటుడు శాంతో, దర్శకుడైన అతడి తండ్రిని అతికిరాతకంగా చంపే శారు. నిరసనకారులు వీరిని చుట్టుముట్టి కర్రలతో కొట్టి చంపినట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. ఈ నటుడు గతంలో హసీనా తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ బయోపిక్‌లో నటించడం గమనార్హం. ఢాకాలోని ప్రము ఖ బంగ్లాదేశీ జానపద గాయకుడు రాహుల్ ఆనందో నివాసానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. నిరసనకారులు దాడి చేయగానే రాహుల్ కుటుంబం అక్కడినుంచి పారిపోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వారు రహస్య ప్రాంతంలో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. జషోర్ జిల్లాలో అవామీలీగ్ నేతకు చెందిన హోటల్‌కు అల్లరిమూకలు నిప్పుపెట్టిన ఘటనలో 24 మంది సజీవ దహనమయ్యారు. మూడు వారాల ఆందోళనల్లో ఇప్పటివరకు ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 440కి చేరుకుంది. సోమవారం ఒక్కరోజే 109 మంది మృతి చెందారు. ఇదిలాఉంటే.. రాజకీయ సంక్షోభం తలెత్తిన బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వానికి మహమ్మద్ యూనస్ నేతృత్వం వహించనున్నారు. ఆయన నోబెల్ శాంతి పురస్కార గ్రహీత. ప్రధానిగా ఉన్న షేక్ హసీనా వైదొలగాల్సి రావడంతో అధ్యక్షుడు మొహమ్మద్ షహబుద్దీన్ మంగళవారం ఉదయం పార్లమెంటును రద్దు చేశారు. తొలుత తాత్కాలిక పరిపాలన యంత్రాంగం ఏర్పాటుకు, తర్వాత కొత్తగా ఎన్నికలు నిర్వహించడానికి మార్గం సుగమం చేశారు. యూనస్‌ను సారథిగా నియమిస్తున్నట్లు మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఆయన ప్రకటన వెలువరించారు.

# నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతాం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తానని అన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు న్యాయం చేస్తాం. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, స్పీకర్ పదవులను బీసీలకే ఇచ్చాం. మంత్రివర్గంలోనూ అగ్రస్థానం కల్పించిన పార్టీ మాది. బీసీలు.. ఆది నుంచీ పార్టీకి అండగా ఉన్నారు. స్థానిక సంస్థల్లో మళ్లీ రిజర్వేషన్లు తెస్తాం. చేనేత రంగంలో సమగ్ర విధానం తీసుకొస్తాం. చేనేతకారుల్లో నైపుణ్యం పెంచి ఆధునిక శిక్షణ ఇప్పిస్తాం. వారికి ఆరోగ్యబీమా కల్పిస్తాం. చేనేత కార్మికులకు జీఎస్టీ తొలగించేందుకు ప్రయత్నిస్తాం. జీఎస్టీ తొలగించకుంటే రియంబర్స్ చేస్తాం అని ప్రకటించారు. నేతన్నలకు రూ.67 కోట్లు ఇచ్చి న్యాయం చేస్తాం. నేతన్నలు సామూహికంగా పనిచేసే విధానానికి శ్రీకారం చుడతాం. చేనేత మగ్గాల కోసం రూ.50వేలు సాయం చేస్తాం. ప్రజలంతా చేనేత వస్త్రాలు ధరించాలి. చేనేత పరిశ్రమను కాపాడటం మన బాధ్యత. నెలకు ఒకరోజైనా చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిస్తున్నానని అన్నారు. చేనేత వస్త్రాలకు ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను ప్రోత్సహిస్తాం. చేనేత మరమగ్గాల కార్మికులకు, సౌర విద్యుత్ ప్యానెళ్ల ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తాం. చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తాం. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చేనేతలో సహజ రంగులను ప్రోత్సహిస్తాం అని చంద్రబాబు తెలిపారు. ఏపీలో ఏ శాఖలో చూసినా దోపిడీ, విధ్వంసం, అవినీతి, వ్యవస్థల నిర్వీర్యమే కనబడుతోంది. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. ఏనాడూ ఇన్ని ఇబ్బందులు చూడలేదు. వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టి.. నిర్వీర్యమైంది. ఇబ్బందులు ఉన్నాయని ఇచ్చిన హామీలను వదిలిపెట్టలేదు. తొలి రోజే ఐదు సంతకాలు పెట్టాను. క్యాబినెట్‌లో పెట్టి నిర్ణయాలు చేసి అమలు చేస్తున్నాం. వైకాపా నేతలు ఐదేళ్లలో ప్రజల భూములు, ఆస్తులు కొట్టేశారు. రికార్డులు తారుమారు చేసి పేదలను అనేక ఇబ్బందులు పెట్టారని చంద్రబాబు మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు తీసుకొస్తామని చెప్పారు. అట్టడుగు వర్గాలను ఆర్థికంగా, రాజకీయంగా , సామాజికంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. చట్టసభల్లో వెనుకబడిన తరగతుల వారికి 33శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో చట్టం కోసం ప్రయత్ని స్తామని అన్నారు. రాబోయే నామినేటెడ్ పోస్టులోనూ బీసీలకు న్యాయం చేస్తామన్నారు.మెగా డీఎస్సీలో 16347 ఉద్యోగాలు ఇవ్వబోతున్నామని తెలిపారు. ల్యాండ్ అండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామని తెలిపారు. ఈనెల 15న 100 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. అన్నదానం చేసే దాతలు అన్న క్యాంటీన్లు ఉపయోగించుకోవాలని సూచించారు. యువత నైపుణ్యం పెంచడానికి స్కిల్ సెంటర్లు ప్రారంభిస్తామని అన్నారు. ప్రయత్నాలతో ఆర్థిక అసమానతలు తొలగించడం సాధ్యమేనని అన్నారు. చేనేత కార్మికుల ఆరోగ్య బీమా కోసం రూ.10 కోట్లు మంజూరు చేస్తానని అన్నారు.

**గద్దె రామమోహన్, విజయవాడ తూర్పు శాసనసభ్యులు:** దేశంలో వ్యవసాయరంగం తర్వాత అధిక మంది ఆధారపడిన రంగం చేనేత రంగం. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక సంస్కరణలు చేపట్టి ప్రపంచ వ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నారు. చేనేత కార్మికులు అంటే ఓ ప్రత్యేకత కలిగినవారు.

**యలమంచిలి సుజనా చౌదరి, విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు:** భారతదేశ వ్యాప్తంగా చేనేతను, చేనేత కార్మికులను కాపాడుకోవాలని బాపూజీ ఎన్నో కార్యక్రమాలు తలపెట్టారు. ఎన్నో సందర్భాల్లో ఉద్యమాలు కూడా చేశారు. బ్రిటిష్ వారితో చేసే పోరాటంలోనూ చేనేత ప్రధాన భూమిక పోషించినట్లు మనం చదువుకున్నాం. నేత కార్మికుల సంక్షేమం కోసం, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రిగారు కృషిచేయడం జరిగింది. అనేక పథకాలు కూడా తీసుకొచ్చారు. కాన్సెప్ట్ టు కంప్లీట్ వరకు నేతన్నలను చేయిపట్టించి నడిపిస్తే వారి ఆదాయాలు మెరుగుపడతాయి. చేతివృత్తులను నమ్ముకున్న వారి తలసరి ఆదాయం కూడా పెరుగుతుంది. అందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా.

**పంచుమర్తి అనురాధ, శాసనసమండలి సభ్యులు:** గత కొన్నేళ్లలో సరైన ఆసరా లేక అనేక మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ముఖ్యంగా ధర్మవరంలో ఈ పరిస్థితిని చూశాం. చేనేత కార్మికులు పలు విధాలుగా దోపిడీకి గురయ్యారు. ఆప్కోను బలోపేతం చేయడం, జనతా వస్త్రాలు ప్రారంభించడం, అనేక పథకాలు అమలుచేయడం, నూలుకు సంబంధించి రాయితీ ఇవ్వడం, థ్రిఫ్ట్ ఫండ్ ఇవ్వడం, వందల కోట్ల రుణాలు మాఫీ చేయ డం, నేత కార్మికులకు ప్రత్యేక పెన్షనల్ ఇవ్వడం, పావలా వడ్డీ రుణా లు.. ఇలా ఏవైనా జరిగాయంటే అవి చంద్రబాబు హయాంలోనే జరిగాయని చెప్పడానికి మేమెంతో గర్వపడుతున్నాం.

# కృష్ణమ్మ పరవళ్లు... ఉప్పొంగిపోయిన సిఎం చంద్రబాబు

- ప్రకాశం బ్యారేజీకి భారీగా వరదనీరు
- 70 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన అధికారులు
- ప్రజలతో కలసి బ్యారేజీ వద్ద సెల్ఫీలు దిగిన చంద్రబాబు





**విజయవాడ, ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లు చూసిన సిఎం చంద్రబాబు పులకరించి పోయారు. ఎన్నాళ్లకెన్నాళ్లకు మళ్లీ జలకళ వచ్చిందంటూ పొంగిపోయారు. కాసేపు అక్కడే ఆగి ఆ దృశ్యాలను చూస్తూ ఉండిపోయారు. చేనేత దినోత్సవ వేడుకలు ముగించుకుని ఉండవల్లి వెళ్తూ ప్రకాశం బ్యారేజీపై కాన్వాయ్ ఆపి సీఎం చంద్రబాబు నాయుడు కిందకు దిగారు. బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లును ఆసక్తిగా తిలకించారు. వరద ప్రవాహాన్ని చూసేందుకు బ్యారేజీ వద్దకు వచ్చిన సందర్శకులను దగ్గరకు పిలిచి మరీ చంద్రబాబు మాట్లాడారు. సందర్శకులతో చంద్రబాబు సెల్ఫీలు దిగారు. కృష్ణమ్మ జలకళ ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. నీటి ప్రవాహాన్ని చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉందంటూ ఆయన సంతోషం వ్యక్తం చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి తమ దగ్గరకు వచ్చి మాట్లాడడంతో సందర్శకులు ఆశ్చర్యానికి గురయ్యారు. చాలా సంతోషంగా ఉందని అన్నారు.

కృష్ణమ్మకు జలకళ రావడం చూసి ఎంతో సంతోషిస్తున్నట్లు తెలిపారు. ఈ నీటి ప్రవాహాన్ని చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉందంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తుతోంది. దీంతో బ్యారేజీలోని మొత్తం 70 గేట్లను ఎత్తి 73,227 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు కాల్వల ద్వారా 13,477 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. సాయంత్రం లేదా రాత్రికి లక్షన్నర క్యూసెక్కులకు చేరుకునే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. గేట్లు ఎత్తిన నేపథ్యంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తున్నారు. దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. కాల్వల ద్వారా విడుదల చేసే వరదనీరు పూడిక ప్రభావంతో రోడ్లపైకి చేరుకోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



ప్రకాశం బ్యారేజీ దగ్గర సామాన్యులతో ఫొటోలు దిగి, వారితో మాట్లాడిన సీఎం



# అమరావతికి కొత్త కళ

- జంగిల్ క్లియరెన్స్ పనులకు ప్రభుత్వం శ్రీకారం
- 30 రోజుల్లోగా ముళ్ల కంపలు తొలగించేలా ముందుకెళ్తున్నాం
- వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాటలో అమరావతికి తీరని నష్టం
- త్వరలో ఐఐటీ నిపుణుల ప్రాథమిక నివేదిక





**అమరావతి,ఆగస్టు 7(ఆంధ్రపత్రిక):**ఐదేళ్లుగా నిర్జీవంగా పడి ఉన్న ఆంధ్రుల రాజధాని అమరావతి కొత్త కళ సంతరించుకోనుంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో దట్టమైన అడవిని తలపించేలా ఏపుగా పెరిగిపోయిన తుమ్మ చెట్లు, ముళ్ల కంపలతో భూములిచ్చిన రైతులు కూడా తమ భూమి ఎక్కడ ఉందో తెలుసుకో లేని పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దీంట్లో భాగంగానే ముందుగా అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులకు శ్రీకారం చుట్టారు. మొత్తం 36.5 కోట్లతో నాగార్జున కన్ స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్(ఎన్ సీసీ) సంస్థ ఈ పనులను టెండర్ ద్వారా దక్కించుకుంది. మొత్తం 23 వేల 429 ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టింది. నిన్న ఉదయం 9 గంటలకు అమరావతిలోని ఎన్ 9 రహదారిని ఆనుకొని ప్రస్తుత సచివాలయం ఉన్న వెనుకవైపు జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే తాడికొండ శ్రావణ్ కుమార్‌తో కలిసిప్రత్యేక పూజలు అనంతరం స్వయంగా పొక్లెయిన్‌ను ఆపరేట్ చేసి పనులను ఉత్సాహంగా ప్రారంభించారు మంత్రి నారాయణ, ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ అమరావతికి ఇవాళ శుభోదయం 2014-19 మధ్య కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మీద నమ్మకంతో అమరావతి కోసం కేవలం 38 రోజుల్లోనే 34 వేల ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతులు ప్రభుత్వానికి ఇచ్చారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించిన భూమిలో మాస్టర్ ప్లాన్ ద్వారా రోడ్లు, భవనాలు, ఇతర మౌళిక వసతులు కల్పించేందుకు 41,484 కోట్లతో పనులు చేపట్టినట్లు మంత్రి నారాయణ తెలిపారు. మొత్తం 58 వేల ఎకరాలు అమరావతి పరిధిలో ఉండగా 24 వేల ఎకరాల్లో దట్టమైన అడవిలా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయన్నారు. వెంటనే కంపలు తొలగించాలన్న సీఎం ఆదేశాలతో పనులు ప్రారంభించామన్నారు. 30 రోజుల్లోగా పనులు పూర్తి చేసేలా టెండర్ల ప్రక్రియ పూర్తిచేసామన్నారు.



విలేకరుల సమావేశంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడతో కలిసి మదర్స్ మిల్క్ బ్యాంక్ గురించి వివరించిన ఆంధ్రా హాస్పిటల్స్ చీఫ్ ఆఫ్ చిల్డ్రన్ సర్వీసెస్ పీవీ.రామారావు...



ఆంధ్రపత్రిక ఫొటోలు: సిహెచ్.విజయభాస్కర్

విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీటిని విడుదల చేసిన నీటిపారుదలశాఖ అధికారులు..



## వర్కింగ్ మహిళల పెంపుపై పార్లమెంటులో
# మాగుంట ప్రశ్న



**ఒంగోలు, ఆగస్టు 7 (ఆంధ్రపత్రిక):** దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలురంగాలలో ఉద్యోగం మరియు శిక్షణలో పనిచేసే/వర్కింగ్ వ్యక్తులు వివరాలు, మహిళల పెంపుదలకు ప్రభుత్వ పథకాలు- కార్యక్రమాలు, ఖర్చుచేసిన నిధులు, లబ్దిదారులు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డిగారు అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మిక మరియు ఉపాధి శాఖ సహాయక మంత్రి, సుశ్రీ శోభ కరండ్లజీ సమాధానమిస్తూ- ప్రతి ఏడాది కేంద్ర గణాంక మరియు కార్యక్రమాల నిర్వహణ శాఖ ఉపాధి-నిరుద్యోగంపై సర్వే జరుపుతుందని, చివరి వార్షిక నివేదిక ప్రకారం దేశంలో 15 సంవత్సరాలు దాటిన పనిచేసే వ్యక్తుల శాతం ఆంధ్రప్రదేశ్ లో 2017-18 లో వున్న 57.2 శాతం 2022-23 లో 58.6 శాతానికి పెరిగిందని మరియు 2022-23 లో సిక్కింలో అత్యధికంగా 74.0 శాతం వుండగా, హర్యానాలో అత్యల్పంగా 44.9 శాతం వున్నదని తెలిపారు. దేశం మరియు ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాలలో పనిచేసే మహిళల పెంపుదలకు పి.యం. ముద్ర యోజన, స్టాండ్ అప్ ఇండియా, స్టార్ట్ అప్ ఇండియా, ఉమెన్ ఇన్ సైన్సు ఇంజనీరింగ్కం, ప్రొమొటింగ్ ఆపర్చునిటీస్ ఫర్ విమెన్ ఇన్ రీసెర్చ్, పి.యం.ఉపాది కల్పన, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీన్ కౌసల్య యోజన, మహాత్మగాంధి జాతీయ ఉపాది హామీ, దీన్ దయాళ్ అంత్యోదయ యోజన నేషనల్ అర్బన్ లైవ్లీ హూడ్స్ మిషన్, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ సంస్థలు మొదలగు పథకాలు-కార్యక్రమాలను ప్రభుత్వం అమలుచేయుచున్నదని, వీటిద్వార మహిళల ఉపాది, నైపుణ్యత తదితర అవకాశాల గత 5 సంవత్సరాలనుండి గణనీయంగా పెరుగుచున్నాయని తెలిపారు. పనిచేసే మహిళల ఉపాది పెంపుకు మహిళా పారిశ్రామిక శిక్షణా సంస్థలు, జాతీయ వృత్తి శిక్షణ సంస్థలు మరియు ప్రాంతీయ వృత్తి శిక్షణ సంస్థలు ద్వార వారికి శిక్షణ ఇవ్వబడుచున్నదని మరియు పనిచేసే 4 కోట్ల యువతకు ఉపాది, నైపుణ్యత తదితర అవకాశాల కల్పనకు 2024-25 బడ్జటులో కేంద్ర రూ.2 లక్షల కోట్లు ప్రకటించిందని కేంద్ర మంత్రి తెలియజేశారు.



# కానరాని మార్పు



## మాన్యులకు తప్ప అన్యులకు దొరకని శ్రీవారి నైవేద్య ప్రసాదాలు

**తిరుమల, ఆగస్టు 7(ఆంధ్రపత్రిక):**అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని నివాసమైన తిరుమల పవిత్ర పుణ్య క్షేత్రంలో కొలువై వున్న శ్రీనివాసునికి నిత్య నైవేద్యాలు ఉదయం నుంచి రాత్రి వరకు మూడు పూటలా గుమగుమలాడే నేతితో తయారు చేసిన ప్రసాదాలను స్వామి వారికి నివేదన చేస్తారు. ఈ ప్రసాదాల పేరు వింటేనే భక్తితో స్వీకరించాలని ప్రతి భక్తుడు ఉవ్విరూళూరుతుండాడు. వీటిలో మాత్ర, పులిహొర, చక్కెర పొంగళి, మిరియాల పొంగళి, కదంబం, దద్ధోజనం, సీరా, శాకర్‌బాత్, తోమాల దోశలు, పోలిలు, పెసరపప్పు పాయసం వంటివి స్వామి వారికి సమర్పించే ప్రసాదాలలో ఇవి భాగమై ఉంటాయి. ఇవి కాకుండా ధనుర్మాసంలో శ్రీవారికి నిర్వహించే సుప్రభాత సేవకు బదులుగా తిరుప్పావై సేవలో 14 రకాలతో కూడిన ప్రసాదాలను ప్రత్యేకంగా తయారు చేసి స్వామి వారికి నివేదించడం జరుగుతుంది. ఇదిలా ఉంటే సోమవారం జరిగే విశేష పూజలో పెద్ద దోశలు, అప్పాలు, విశేష పూజ లడ్డూలు వగైరాలు ఉంటాయి. మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవలో మాత్ర, సీరా నివేదనలు చేస్తారు. బుధవారం స్వామి వారికి నిర్వహించే సహస్రకళషాభిషేకం సేవలో పాయసం ప్రధాన నివేదన ఉంటుంది. గురువారం శ్రీవారికి జరిగే తిరుప్పావై సేవలో జిలేబి, మురుకు స్వామి వారికి నివేదన ఉంటుంది. ఇక శుక్రవారం స్వామి వారికి జరిగే అభిషేకం సేవలో నేతితో తయారు చేసిన పోలీలను నివేదన చేస్తారు. ఇలా స్వామి వారికి రకరకాలు నివేదించిన ప్రసాదాలు శ్రీవారికి జరిగే సేవలో పాల్గొన్న భక్తులకు మాత్రం దక్కుతుంది. వీటిని ప్రత్యేకించి కౌంటర్లలో విక్రయించడం లేదు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి నిత్యం నివేదన చేసే చక్కెర పొంగళి, దద్ధోజనం, సీరా, మిరియాల పొంగళి, పులిహొర ప్రసాదాలను గతంలో భక్తులకు విక్రయించే వారు. అలా భక్తులు పొందిన అన్నప్రసాదాలను ఆలయం వద్ద ఇతర భక్తులకు పంచిపెట్టేవారు. మొక్కుబడి ఉన్న భక్తులు ప్రసాదాల కోసం నిర్ణీత సొమ్మును టిటిడికి చెల్లించి, ఆ రశీదును మహద్వారం వద్ద సెక్యూరిటి సిబ్బందికి చూపించి, వారి ద్వారా ప్రసాదాలను పొందేవారు. భక్తులకు తగినన్ని ప్రసాదాలను అందించలేని కారణంగా వీటి విక్రయాన్ని టిటిడి నిలిపివేసింది. ఇదిలా ఉంటే ప్రసాదాలకు అన్నింటిలో గురువారం రోజు శ్రీవారికి తిరుప్పావడ సేవలో నివేదించే జిలేబి, మురుకు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. వీటిని తిరుప్పావడ సేవలో పాల్గొన్న భక్తులకు మాత్రం దక్కుతుంది. ఇది దొరకాలంటే టిటిడి ఉద్యోగుల నుంచి అధిక మొత్తంలో సుమారు 1000 రూపాయల నుంచి 3000 రూపాయల వరకు ఖర్చు చేయవలసి ఉంటుంది. కాగా ఈ జిలేబి పొందాలంటే సంబంధిత టిటిడి ఉన్నతాధికారుల సిఫార్సుతో 500 రూపాయలు చెల్లించి వకపడి కౌంటర్‌లో పొందవచ్చు.








తిరుమలను సందర్శించి, స్వామి వారిని దర్శించుకున్న భక్తులు అత్యంత పవిత్రమైన, ప్రీతిపాత్రమైన ప్రసాదాలను స్వీకరించాలంటే మాన్యులకు తప్ప, అన్యులకు ఇవి సాధ్యం కావడం లేదు.

ఈ తంతు ఇలా ఉంటే స్వామి వారి సన్నిధిలో భక్తులకు దర్శనానంతరం శ్రీవారి తీర్థం ఇస్తారు. తీర్థం కావాలంటే వాటిని టిటిడి కౌంటర్‌లో విక్రయించడం లేదు. అయితే రంగనాయకుల మండపంలో శ్రీవారి వేదాశీర్వచనం పొందే అత్యంత ప్రముఖులకు అందజేసే శ్రీవారి మహాప్రసాదం ప్యాకెట్‌లో ఈ తీర్థం ఉంటుంది. దీనితోపాటు అక్షింతలు, కంకణాలు, పచ్చకర్పూరం ఉంటుంది.

ఈ మహాప్రసాదం ప్యాకెట్లను కూడా టిటిడి కౌంటర్లలో విక్రయించడం లేదు. వీటిని పొందాలంటే అధిక ధర పెట్టి రహస్యంగా పొందాల్సిందే. కేవలం లడ్డూ, వడ, కలకండ ప్రసాదాలను మాత్రం భక్తులకు కౌంటర్లలో టిటిడి విక్రయిస్తున్నారు. వాటితోపాటు స్వామి వారికి నివేదించే అన్నప్రసాదాలను కూడా భక్తులకు అందుబాటులో ఉంచాలని పలువురు భక్తులు కోరుతున్నారు. టిటిడి ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ గైకొంటే స్వామికి నివేదన చేసే అన్నప్రసాదాలలో కొన్నింటినైనా భక్తులకు అందుబాటులో విక్రయించాలని పలువురు భక్తులు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఎన్‌డిఏ ప్రభుత్వంలో ఇది సాధ్యపడుతుందని కొందరి భక్తుల వువాచ.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com